ANN తెలుగు

Follow: @ANNTELUGU

08-05-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 131 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ట్రాఫిక్ చట్రం ఛేదించిన సీఎం రేవంత్ రెడ్డి

### నిన్నటి మాట నేటి ఆచరణ

సామాన్యుడికి ఆటంకం లేని ప్రజాపాలన

ముఖ్యమంత్రి వాహనం పక్కనే సామాన్యుల కార్లు, ఆటోలు

**హైదరాబాద్, మహా :** అధికార గర్వం తలకెక్కిన నాయకుడు.. అడుగు తీసి అడుగు వేయాలంటే వందల మంది కాపలా, వేల వాహనాల నిలిపి వేత ఆనవాయితీగా మారిన రోజులివి. కానీ, "నేను పాలకుడిని కాదు.. మీలో ఒకడైన సేవకుడిని" అని చాటిచెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన మాటపై నిలబడి భాగ్యనగర వీధుల్లో సరికొత్త ప్రజాస్వామ్య దృశ్యాన్ని ఆవిష్కరించారు.

**మాట ఇచ్చారు.. మార్పు తెచ్చారు**

బుధవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లే క్రమంలో, ఎండలో కిలోమీటర్ల మేర నిలిచి పోయిన వాహనాలను, ప్రజల అవస్థలను చూసి ముఖ్యమంత్రి మనసు ద్రవించింది. "నా గమ్యం కోసం జనం ఆగాలా? నా ప్రయాణం కోసం సామాన్యుడి సమయం బలి కావాలా?" అంటూ అధికారులపై

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### మమత బర్తరఫ్


- బెంగాల్ గవర్నర్ ఆర్డర్స్



02

### పిఠాపురం వర్మ ఔట్

- ఇంచార్జ్ పదవి తొలగించిన బాబు
- కన్నీళ్లు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే



02

### గవర్నర్లు బీజేపీ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు

- ఎంపీ కపిల్ సిబల్ కీలక వ్యాఖ్యలు



03



### అందరికీ వాయింపే

- తమిళ ఓటరు 'షాక్' ట్రీట్మెంట్!
- నిద్రలేదు.. సుఖం లేదు
- డీఎంకేకు షాక్ .. అన్నాడీఎంకేకు చెక్
- టీవీకేకు టెస్ట్

వివరాలు 4లో



### తెలంగాణ విద్యారంగంలో పెను ప్రకంపనలు

- ఇంటర్ బోర్డు రద్దు దిశగా సర్కార్ అడుగులు?
- లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుపై 'విలీన' గండం
- అర్ధాంతరంగా నిలిచిన అడ్మిషన్ల ప్రక్రియ
- రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం
- ఆందోళనలో పేరెంట్స్.. ఆగ్రహంలో జేఏసీ

వివరాలు 2లో

# గవర్నర్ గేమ్

## తమిళనాడులో హైడ్రామా

- ప్రజాతీర్పును అవమానించడంపై భగ్గుమంటున్న రాజకీయపక్షాలు
- విజయ్ కు పెరుగుతున్న మద్దతు
- రిసార్టులకు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు
- సౌత్ లో కమలం వరుస తప్పిదాలు.. ప్రజలతో ఆటలు
- టీవీకేకు ఛాన్స్ ఇవ్వాలన్న వీసీకే, సీపీఎం, కమల్ హాసన్, ప్రకాష్ రాజ్
- ప్రభుత్వాన్ని రద్దుచేసి మళ్ళీ ఎన్నికలు జరపాలన్న జోహో ఫౌండర్ శ్రీధర్ వేంబు
- టీవీకేకు ఛాన్స్ ఇవ్వాలని.. తాము ప్రభుత్వంలో జోక్యం చేసుకోబోమన్న డీఎంకే స్టాలిన్



**చెన్నై, మహా:** తమిళనాడు పాలిటిక్స్ పొలిటికల్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నాయి. నటుడు, రాజకీయ సంచలనం విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం అసెంబ్లీలో 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్ వీడటం లేదు. 118 మంది మద్దతు ఉంటేనే పీఠం ఎక్కనిస్తానని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ స్పష్టం చేయడంతో, విజయ్ ఇప్పుడు అదనపు ఎమ్మెల్యేల వేటలో పడ్డారు. రాజకీయ రణక్షేత్రం ఇప్పుడు లోక్ భవన్ చుట్టూ తిరుగుతోంది. అతిపెద్దపార్టీకి రాజ్యాంగం ప్రకారం అవకాశం ఇవ్వాల్సి ఉన్నా ముందే బలం చూపాలని.. గవర్నర్ ఆడుతున్న గేమ్ పై తమిళ నాడులోనే కాక దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గవర్నర్లను అడ్డం పెట్టుకుని బిజెపి రాజకీయాలు చేస్తోందని,

మిగతా 2లో

### గవర్నర్ గీసిన లక్ష్మణ రేఖ

బుధవారం విజయ్‌తో జరిగిన భేటీలో గవర్నర్ మరోసారి ముందు బలం ఉంటేనే.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తానని స్పష్టం చేశారు. "కేవలం అతిపెద్ద పార్టీగా ఉండటం సరిపోదు, సభలో 118 మంది మద్దతు ఉన్నట్లు ఆధారాలు చూపాలి" అని గవర్నర్ తేల్చి చెప్పారు.టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేలు (విజయ్ రెండు చోట్ల గెలవడంతో ఒక సీటు తగ్గింది), కాంగ్రెస్ నుంచి 5 మంది మద్దతుతో కలిపి 112 మంది జాబితాను విజయ్ సమర్పించారు. అయితే, మరో ఆరుగురు తక్కువ కావడంతో గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. బలనిరూపణ అసెంబ్లీలో చేసుకుంటాం అని విజయ్ తేల్చిచెప్పారు. ప్రజల తీర్పును గౌరవించి టీవీకేకు ఛాన్స్ ఇవ్వాలని వీసీకే, సీపీఎంలు డిమాండ్ చేశాయి. మరోవైపు ప్రభుత్వ ఏర్పాటులో తాము జోక్యం చేసుకోబోమని, అతిపెద్దపార్టీగా ఉన్న టీవీకేకు ఛాన్స్ ఇవ్వాలని డీఎంకే అధినేత స్టాలిన్ సూచించారు. మరోవైపు మిత్రపక్షాలకు కూడా డీఎంకే స్వేచ్ఛనిచ్చింది.

### తమిళ్ తాళింపు

- రిసార్టు రాజకీయం...
- పుదుచ్చేరికి అన్నాడీఎంకే ఎమ్మెల్యేల తరలింపు
- అన్నాడీఎంకే రెండు ముక్కలు
- పళనిస్వామిపై ఎమ్మెల్యేల తిరుగుబాటు

2లో

# కరీంనగర్‌లో హైటెన్షన్

## పాడి కౌశిక్ వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ శ్రేణులు

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కార్యాలయంపై దాడి

ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం.. హుజూరాబాద్ లోనూ దాడికి యత్నం

తీవ్ర ఉద్రిక్తత.. 13 మందిపై కేసులు

రేపు కరీంనగర్ బంద్ కు పిలుపునిచ్చిన బీఆర్ఎస్

నాపై పక్కా ప్లాన్‌తోనే హత్యాయత్నం : ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

మా సహనాన్ని పరీక్షించొద్దు'.. బీఆర్ఎస్‌కు బండి సంజయ్ స్ట్రాంగ్ వార్నింగ్

కౌశిక్ రెడ్డి మాటలకు ఎవరో ఒకరు తంతారని తెలుసు: కాంగ్రెస్ విప్ విజయరమణారావు



**కరీంనగర్, మహా :**

కరీంనగర్ జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. మీడియా సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు భగ్గుమంటూ కౌశిక్ రెడ్డిపై దాడిచేసేందుకు బీఆర్ఎస్ క్యాంపు కార్యాయంలోకి దూసుకెళ్ళాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై దాడులు, వాహనాల ధ్వంసం, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలతో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు

మిగతా 2లో

### మా సహనం పరీక్షించొద్దు

- బీఆర్ఎస్ కు బండి సంజయ్ వార్నింగ్
- దాడులు దౌర్జన్యాలు బీఆర్ఎస్ కల్చర్ అంటూ ఫైర్

3లో

### బండిపై తంబాకు వ్యాఖ్యలతో బీజేపీ శ్రేణుల భగ్గు

3లో

### కౌశిక్ రెడ్డి మాటలకు ఎవరో ఒకరు తంతారని తెలుసు

కాంగ్రెస్ విప్ విజయరమణారావు

2లో

# ఢిల్లీ భయం నుంచి హైదరాబాద్ భరోసా వరకు

30 ఏళ్ల తర్వాత దొరికిన అసలైన స్వేచ్ఛ

వైరల్ అవుతున్న యువకుడి వీడియో

సిటీలో భద్రత, మానసిక ప్రశాంతత మెరుగ్గా ఉందన్న పర్వ్ శర్మ

**హైదరాబాద్:** భాగ్యనగరం అంటే కేవలం ఐటీ హబ్ మాత్రమే కాదు.. ఇక్కడ దొరికే మానసిక ప్రశాంతత, భద్రతా భావం వెలకట్టలేనిదని మరోసారి నిరూపితమైంది. గత 30 ఏళ్లుగా దేశ రాజధాని ఢిల్లీలో నివసించిన పర్వ్ శర్మ అనే యువకుడు, హైదరాబాద్ గడ్డపై తను అనుభవిస్తున్న స్వేచ్ఛ గురించి పంచుకున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**ఆందోళనల రాజధాని వర్సెస్ ఆత్మీయ నగరం**

ఢిల్లీలో నిరంతరం ఏదో ఒక అభద్రతా భావం వెన్నాడుతుండేదని పర్వ్ శర్మ తన ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని జీవనశైలితో పోలిస్తే హైదరాబాద్‌లో తనకు లభించిన భద్రతా భావం, స్వేచ్ఛాయుత వాతావరణం గురించి ఆయన ఎంతో భావోద్వేగంతో వివరించారు. ఉద్యోగ రీత్యా తన భార్యతో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చిన పర్వ్, తన అనుభవాలను పంచుకున్నారు. "ఢిల్లీలో రోడ్డు మీద నడుస్తున్నప్పుడు ఫోన్ పట్టుకోవాలన్నా, ఒంటి మీద బంగారం వేసుకోవాలన్నా నిరంతరం ఓ కన్నేసి ఉంచాలి. దొంగతనా



లు, వేధింపుల భయంతో ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసుకుంటూ అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా మహిళలు రాత్రిపూట ఒంటరిగా ప్రయాణిస్తే, వారు ఇంటికి చేరేవరకు కుటుంబమంతా ఫోన్ కాల్స్, లొకేషన్ ట్రాకింగ్‌తో కంగారు పడటం అక్కడ సర్వసాధారణం" అని ఆయన పేర్కొన్నారు.

మిగతా 3లో

# మోదీ రాకతో తెలంగాణలో బిజెపి ప్రభంజనం

- డైవర్షన్ పాలిటిక్స్ లో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు
- బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ ఫైర్



**హైదరాబాద్, మహా :** ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త మార్పునకు నాంది కాబోతోందని, మోదీ పట్ల ప్రజల్లో కనిపిస్తున్న అఖండ స్పందన చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భయపడుతున్నాయని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్ అన్నారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణకు వస్తున్న నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధమయ్యారన్నారు.ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బిజెపి శరవేగంగా ఎదుగుతోందని, అభివృద్ధి కావాలంటే బిజెపి అధికారంలోకి రావాలనే నిర్ణయానికి తెలంగాణ ప్రజలు వచ్చారన్నారు. ఇప్పటికే కేంద్రం సుమారు రూ.12.5 లక్షల కోట్ల విలువైన మౌలిక వసతులు, ప్రాజెక్టులను తెలంగాణకు కేటాయించిందని ఆయన గుర్తుచేశారు. మోదీ సభకు వస్తున్న ప్రజా స్పందనను దారి మళ్లించేందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'విద్యుత్ కొనుగోలు విచారణ'

మిగతా 3లో

# అవసరం లేకున్నా ఆపరేషన్

### యశోదా ఆస్పత్రికి రూ. 50 లక్షల భారీ జరిమానా

**హైదరాబాద్, మహా:** 'దేవుడా అని మొక్కితే దయ్యమయినట్లు'.. ఓ మహిళ పరిస్థితి అలాగే తయారైంది. అనారోగ్యం నుంచి విముక్తి కలిగిస్తారని ఆశతో ఆస్పత్రికి వెళ్తే, ఆ వైద్యుల నిర్లక్ష్యం ఆమె జీవితాన్నే తలకిందులు చేసింది. అవసరం లేకున్నా శస్త్రచికిత్స చేసి, బాధితురాలిని మంచాన పడేసిన ఘటనలో హైదరాబాద్ మలక్‌పేటలోని యశోదా ఆస్పత్రికి జిల్లా వినియోగదారుల కమిషన్ భారీ జరిమానా విధించింది.

మిగతా 2లో



# గవర్నర్ గేమ్

(మొదటిపేజీ తరువాయి)

సౌత్ సోల్ ను అర్థం చేసుకోవడంలో బిజెపి ఇప్పటికీ విఫలమవుతూ విలన్ అవుతోందని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**అన్నాడీఎంకేలో చీలిక.. రిసార్ట్ రాజకీయం!**

ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన ఆ ఆరుగురి కోసం విజయ్ కళ్లు అన్నాడీఎంకే వైపు పడ్డాయి. అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి మద్దతుకు విముఖంగా ఉన్నప్పటికీ, పార్టీలోని 25 మందికి పైగా ఎమ్మెల్యేలు విజయ్‌కు జైకొట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సి.వి. షణ్ముగం నేతృత్వంలో ఈ తిరుగుబాటు ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని రిసార్టుకు తరలిపోవడం సంచలనం సృష్టిస్తోంది. వీరిలో 15 మంది ఇప్పటికే ఒకే శిబిరంలో ఉన్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం.

**విజయ్‌కు వెల్లువెత్తిన మద్దతు**

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అతిపెద్ద పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా ఆపడం అన్యాయమని పలువురు ప్రముఖులు గళమెత్తారు "ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. లోక్‌భవన్‌లో కాదు, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునే అవకాశం ఇవ్వాలి" అని రాజ్యసభ సభ్యులు కమల్ హాసన్ ట్వీట్ చేశారు. విజయ్‌కు ప్రజామోదం ఉందని, గవర్నర్ తీరు రాజ్యాంగ విరుద్ధమని ప్రకాశ్ రాజ్ మండిపడ్డారు.

**మళ్లీ ఎన్నికలు రావాలా? - శ్రీధర్ వేంబు సంచలనం**

జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబు భిన్నమైన వాదనను తెరపైకి తెచ్చారు. అస్థిర ప్రభుత్వాల కంటే రాష్ట్రం మళ్లీ ఎన్నికలకు వెళ్లడమే ఉత్తమమని, అప్పుడు విజయ్ భారీ మెజారిటీతో వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.

**విజయ్ కు ఎందుకు అవకాశం ఇవ్వట్లేదు- విశాల్ ఫైర్**

విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. 201718లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలను విశాల్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని విశాల్ డిమాండ్ చేశారు. ప్రజల తీర్పుకు గౌరవం ఎక్కడ? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదని, ప్రజలకు కూడా తెలుసని విశాల్ అన్నారు.

# తమిళ తాళింపు

## రిసార్టు రాజకీయం... పుదుచ్చేరికి అన్నాడీఎంకే ఎమ్మెల్యేల తరలింపు

### అన్నా డీఎంకే రెండు ముక్కలు.. పళనిస్వామిపై ఎమ్మెల్యేల తిరుగుబాటు

**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయాలు మరోసారి రిసార్టు రాజకీయాలకు వేదికయ్యాయి. నూతన ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతున్న వేళ, రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా అన్నాడీఎంకే అప్రమత్తమైంది. సుమారు 28 మంది ఎమ్మెల్యేలను హుటాహుటిన పొరుగునే ఉన్న పుదుచ్చేరిలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు తరలించింది. వీరంతా అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు సి.వి. షణ్ముగం మద్దతుదారులని ప్రచారం జరుగుతుండటంతో అటు పార్టీలోనూ, ఇటు రాష్ట్ర రాజకీయాల్లోనూ తీవ్ర కలకలం రేగుతోంది. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

**తమిళ తాళింపు**

తమిళ రాజకీయాలు అన్ని పార్టీలను కుదిపేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో డీఎంకేకు అధికారం పోగా, విజయ్ దెబ్బకు అన్నాడీఎంకే పార్టీ పరిస్థితే గందరగోళంగా తయారయ్యే పరిస్థితి నెలకొంది. గవర్నర్ గేమ్ కారణంగా బీజేపీపై తీవ్ర వ్యతిరేకత పెరుగుతుండగా, మరోవైపు విజయ్ కు మద్దతుగా 25మందికి పైగా అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రిసార్టులో గుసగుసలాడుతున్నారు. అన్నాడీఎంకే చీలిక వర్గానికి డిప్యూటీసీఎంతో పాటు పలు మంత్రిపదవులు కూడా ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు అన్నాడీఎంకేతో కలిసేదాకా గవర్నర్ ట్విస్ట్ లు ఇస్తూనే ఉంటారన్న ప్రచారం రాజకీయవర్గాల్లో ఉంది. బీజేపీకి సంబంధం లేకుంటే, రాజకీయ క్రీడ చేయకుంటే టీవీకేను అధికారం చేపట్టేలా ఆహ్వానించవచ్చు కదా అని రాజకీయవక్షాలు, ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. అన్నామలైను పక్కనబెట్టి భారీ మూల్యం చెల్లించుకున్న బీజేపీ ఇంకా తమిళరాజకీయాలను, ప్రజల మనోభావాలను అర్థం చేసుకోక చీప్ ట్రిక్స్ ప్లే చేస్తోందన్న విమర్శలు అన్ని ప్రాంతాల నుండి వినబడుతున్నాయి. పళనిస్వామికి 47మంది ఎమ్మెల్యేలుండగా, ఇందులో 25 నుండి 28మంది బయటకు వచ్చేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది.

**పవర్ షేరింగ్‌పై తెరవెనుక చర్చలు!**

రాష్ట్ర అసెంబ్లీలో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు మద్దతు ఇచ్చే విషయంలో అన్నాడీఎంకేలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మ్యాజిక్ ఫిగర్‌కు కొద్ది దూరంలో ఆగిపోయిన విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చి, ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని అన్నాడీఎంకేలోని ఒక వర్గం గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ మేరకు టీవీకే నేత సెంగోట్టయ్యన్‌తో అన్నాడీఎంకే సీనియర్ నేతలు రహస్య చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల్లో భాగంగా సి.వి. షణ్ముగంకు ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు కీలక మంత్రి పదవులు ఆఫర్ చేసినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తన మద్దతుదారులైన ఎమ్మెల్యేలను షణ్ముగం పుదుచ్చేరికి తరలించారని, రానున్న రోజుల్లో మరికొందరు ఎమ్మెల్యేలు అక్కడికి చేరుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

**అన్నాడీఎంకేలో ముదిరిన విభేదాలు**

మరోవైపు, టీవీకేకు మద్దతు ఇచ్చే ప్రతిపాదనపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి (ఈపీఎస్) తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. విజయ్ పార్టీతో జతకట్టడం వల్ల భవిష్యత్తులో పార్టీ ఉనికికే ప్రమాదమని ఆయన భావిస్తున్నారు. అయితే, సీవీ షణ్ముగం, ఓఎస్ మణియన్ వంటి నేతలు మాత్రం అధికారంలోకి వచ్చే అవకాశాన్ని జారవిడుచుకోకూడదని పట్టుబడుతున్నారు. ఈ నాయకత్వ పోరు చివరకు పార్టీలో చీలికకు దారితీస్తుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైతే చట్టపరమైన మార్గాలను అన్వేషించాలని లేదా తిరిగి ఎన్నికలకు వెళ్లాలని ఈపీఎస్ వర్గం భావిస్తుంటే, షణ్ముగం వర్గం మాత్రం అధికార పంపిణీ వైపే మొగ్గు చూపుతోంది.


**పార్టీ ఐక్యంగానే ఉంది: సత్యన్**

**పరిణామాలు వేగంగా మారుతున్నా, అన్నాడీఎంకేలో ఎలాంటి చీలికలు లేవని పార్టీ అధికార ప్రతినిధి సత్యన్ స్పష్టం చేశారు. పార్టీ ఐక్యంగానే ఉందని, టీవీకేతో చర్చలు జరిగిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అయితే తుది నిర్ణయం హైకమాండ్ తీసుకుంటుందని, అంతవరకు కార్యకర్తలు సంయమనం పాటించాలని కోరారు. బుధవారం టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ నేరుగా పళనిస్వామితో సమావేశం కావడం, ఆ తర్వాత ఎమ్మెల్యేల తరలింపు చోటుచేసుకోవడం చూస్తుంటే తమిళనాడు పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ మరింత పెరిగింది.**

# కరీంనగర్‌లో హైటెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

నెలకొన్నాయి. మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం ఘటన రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. కరీంనగర్ నగరంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బిజెపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. కార్యాలయ ఆవరణలోకి చొరబడి అక్కడ పార్క్ చేసి ఉన్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. కార్యాలయ ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేసినట్లు సమాచారం. ఘటన సమయంలో అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ రాజు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులు నిందితులపై భారతీయ న్యాయ సంహిత (BNS)లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 189, 191(3), 329(4), 324(4), 292, 351(2)తో పాటు 190 సెక్షన్ కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



**బండి వర్సెస్ బీఆర్ఎస్**

సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ దాడికి బీజేపీ కార్యకర్తలే బాధ్యులని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. దాడిలో పాల్గొన్న కొందరు బీజేపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం వద్ద నుంచి బయలుదేరి వచ్చారని ఆరోపిస్తూ, ఈ ఘటన వెనుక బండి సంజయ్ ప్రోత్సాహం ఉందని బీఆర్ఎస్ స్థానిక నాయకత్వం విమర్శించింది. అయితే ఈ ఆరోపణలను బీజేపీ వర్గాలు ఖండిస్తున్నాయి. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నాయి.

**హుజూరాబాద్‌లో ఉద్రిక్తత**

ఈ ఘటన ప్రభావం హుజూరాబాద్‌కు కూడా చేరింది. అక్కడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేసుకుంటూ ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. కొందరు కర్రలతో దాడి చేసినట్లు సమాచారం. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**భారీ భద్రత మధ్య ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తరలింపు**

కరీంనగర్లో బిజెపి నేతల ఘర్షణ సమయంలో క్యాంపు కార్యాలయంలో ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని పోలీసులు భారీ భద్రత మధ్య అక్కడి నుంచి తరలించారు. ముందుగా ఆయనను రక్షణగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు మోహరించగా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

**కరీంనగర్ బంద్‌కు బీఆర్ఎస్ పిలుపు**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిని నిరసిస్తూ ఈనెల 9న కరీంనగర్ బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈ ఘటనను అత్యంత సీరియస్‌గా తీసుకున్న పార్టీ అధిష్ఠానం, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టే అవకాశాలపై కూడా చర్చిస్తున్నట్లు సమాచారం.

**రేపు కరీంనగర్‌కు కేటీఆర్**

ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 9న కరీంనగర్‌కు రానుండటం రాజకీయ ఉత్కంఠను మరింత పెంచుతోంది. దాడి జరిగిన ప్రాంతాన్ని ఆయన సందర్శించి పార్టీ నేతలతో సమావేశం కానున్నారు.

**నగరంలో భారీ బందోబస్తు**

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కరీంనగర్ నగరంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం, బీజేపీ జిల్లా కార్యాలయం, బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 24 గంటల నిఘా కొనసాగిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

**రాజకీయంగా హీట్ పెరిగిన కరీంనగర్**

ఒకవైపు బంద్ పిలుపు, మరోవైపు కేటీఆర్ పర్యటన బిజెపి కార్యకర్తల దాడి టిఆర్ఎస్ బిజెపి నేతలు పరస్పర ఆరోపణలతో కరీంనగర్ రాజకీయాలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ ఘటన ఎటువంటి మలుపు తిరుగుతుందోనన్న ఆసక్తి జిల్లా రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# పిఠాపురం వర్మ ఔట్

## ఇంచార్జ్ పదవి తొలగించిన బాబు.. కన్నీళ్ళు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే


**కాకినాడ, మహా :** పిఠాపురం నియోజకవర్గ టీడీపీలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. గత కొంతకాలంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మను ఆ బాధ్యతల నుండి తప్పిస్తూ టీడీపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. పిఠాపురంలో తన అనుచరులు, కార్యకర్తలతో భేటీ అయిన వర్మ.. మీడియా ముందు మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఒకానొక దశలో కన్నీళ్లు ఆపుకోలేక ప్రెస్ మీట్‌ను మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయారు. పిఠాపురం ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తనను తప్పిస్తూ పార్టీ తీసుకున్న నిర్ణయంపై వర్మ స్పందిస్తూ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో పార్టీ ప్రయోజనాల కోసం త్యాగం చేయాలని హైకమాండ్ కోరింది, అప్పుడు కూడా కాదనకుండా పనిచేశాను. ఎప్పుడూ పార్టీ బలోపేతానికే కృషి చేశాను తప్ప, ఎన్నడూ వ్యతిరేకంగా పనిచేయలేదు అని ఆయన భావోద్వేగంతో చెప్పారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన ఒక నాయకుడు ఇలా బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి రావడం స్థానిక కార్యకర్తలను సైతం కలిచివేసింది. నియోజకవర్గంలో కూటమి మధ్య ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు, పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని వేయాలని తానే నారా లోకేష్ ను కోరినట్లు వర్మ వెల్లడించారు. తన వ్యక్తిగత నిర్ణయమే అయినప్పటికీ, అధికారికంగా బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి రావడం ఆయనను ఆవేదనకు గురిచేసింది. మంత్రి లోకేష్ తనతో మాట్లాడిన తర్వాతే ఈ నూతన కమిటీ ఏర్పాటు ప్రక్రియ మొదలైందని, దీనికి తన పూర్తి సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**కూటమి సమీకరణాలతో మార్పులు**

పిఠాపురం ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో, ఇక్కడ టీడీపీజనసేన శ్రేణుల మధ్య సమన్వయం అత్యంత కీలకంగా మారింది. గత కొంతకాలంగా స్థానిక జనసేన నేతలు , వర్మ అనుచరుల మధ్య చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు, వివాదాలతో కూటమిలో ఘర్షణ వాతావరణం లేకుండా చూసేందుకే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. వర్మను ఇన్‌ఛార్జ్ పదవి నుంచి తప్పించడం ద్వారా జనసేనతో ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేయాలని టీడీపీ యోచిస్తోంది.

**కార్యకర్తల్లో నిశ్శబ్దం**

మీడియా సమావేశంలో తన రాజకీయ ప్రస్థానాన్ని, పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను గుర్తు చేసుకుంటూ వర్మ కన్నీరు పెట్టుకున్నారు. తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని, కానీ ప్రస్తుత పరిస్థితులు తనను బాధించాయని చెబుతూ ఆయన ప్రెస్ మీట్ మధ్యలోనే నిష్క్రమించారు. పిఠాపురంలో వర్మకు ఉన్న క్యాడర్ బలం దృష్ట్యా, ఆయనను పదవి నుంచి తప్పించడం రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని చర్చ నడుస్తోంది. పార్టీ త్వరలోనే ఇక్కడ కొత్త కమిటీని ప్రకటించే అవకాశాలున్నాయి.




# కౌశిక్ రెడ్డి మాటలకు ఎవరో ఒకరు తంతారని తెలుసు

### కాంగ్రెస్ విప్ విజయరమణారావు

**హైదరాబాద్, మహా :** రోడ్డు మీద పోయే అవారాలాగా, వీధి రౌడీలా కేటీఆర్ మాట్లాడారని, ఆయనకు మించి మాట్లాడే శక్తి మాకు ఉంది.. కానీ, మాకు విజ్ఞత ఉందని ప్రభుత్వ విప్ సీహెచ్. విజయరమణా రావు అన్నారు. వర్షం పడాలని, అక్కడకు వెళ్లి దొంగ ఏడుపులు ఏడవాలని కేటీఆర్ భావిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గురువారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి విజయరమణా రావు మాట్లాడారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ పనికిరాని మాటలు మాట్లాడారని, తిట్ల కోసమే వరంగల్ సభ పెట్టుకున్నారని ఆయన మండిపడ్డారు. ఎద్దు, వ్యవసాయం గురించి తెలిసిన వారెవ్వరూ కేటీఆర్ లా మాట్లాడరన్నారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసి సీఎం సీటులో కూర్చోవాలన్నదే కేటీఆర్ ప్రయత్నమని, మోకాళ్ల పైన నడిచినా ఆయన ఆ సీట్లలోకి వచ్చేది లేదన్నారు. రూ. 12 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారని కేటీఆర్ పచ్చి అబద్ధాలు చెపుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 20 వేల కోట్లు రైతు రుణమాఫీ చేసిందని విజయరమణా రావు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రుణమాఫీ జరిగి మళ్లీ రుణం తీసుకున్న రైతు ఒక్కరైనా ఉన్నారా? దమ్ము ఉంటే రుణమాఫీ పైన తెలంగాణలో ఏ గ్రామానికైనా కేటీఆర్ రావాలి.. తాము వస్తామని ఆయన సవాల్ విసిరారు. అన్ని విధాలుగా రాష్ట్ర రైతులను కేసీఆర్ ముంచారని, వారి పాలనలో కేసీఆర్ మక్కలను ఏనాడు కొనలేదని, తాము మార్క్ ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేస్తున్నామని విజయరమణా రావు చెప్పారు. రైతు బంధు ఇచ్చి అదే సర్వరోగ నివారిణి అని కేసీఆర్ అన్నారని, నాలుగు పంటలకు తమ ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చామన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు సరైనవి కాదని, కౌశిక్ రెడ్డి మాటలకు ఎవరో ఒకరు తంతారని అనుకుంటున్నాం.. అదే జరిగిందని విజయరమణా రావు విమర్శించారు.

# తెలంగాణ విద్యారంగంలో పెను ప్రకంపనలు

- ఇంటర్ బోర్డు రద్దు దిశగా సర్కార్ అడుగులు?
- లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుపై 'విలీన' గండం
- అర్ధాంతరంగా నిలిచిన అడ్మిషన్ల ప్రక్రియ
- రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం
- ఆందోళనలో పేరెంట్స్.. ఆగ్రహంలో జేఏసీ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ విద్యా వ్యవస్థలో అత్యంత కీలకమైన ఇంటర్మీడియట్ బోర్డు మనుగడ ఇప్పుడు ప్రమాదంలో పడింది. దశాబ్దాలుగా స్వతంత్రంగా వ్యవహరిస్తూ కోట్లాది మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఈ బోర్డును రద్దు చేసి, దానిని పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనానికి దారితీస్తోంది. అకడమిక్ ఇయర్ ప్రారంభానికి కేవలం 25 రోజుల ముందు, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాలేజీ యాజమాన్యాలకు మౌఖిక ఆదేశాలు అందడం విద్యార్థుల భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది. ప్రభుత్వ ఈ హఠాత్ నిర్ణయం వెనుక లోతైన విద్యా సంక్షోభం దాగి ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తల్లిదండ్రుల్లో మొదలైన ఆందోళన పోరు**

విద్యా సంవత్సరం ముంగిట ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది తమ పిల్లలను నచ్చిన కళాశాలల్లో చేర్పించి, ఫీజులు కూడా చెల్లించిన తరుణంలో, ఇప్పుడు అడ్మిషన్ల ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. సరైన ప్రణాళిక లేకుండా ఇలాంటి భారీ మార్పులు చేస్తే తమ పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, కనీసం ఏడాది ముందైనా నోటిఫికేషన్ ఇచ్చి విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల లక్షలాది కుటుంబాల్లో ఇప్పుడు ఆందోళన గూడు కట్టుకుంది.

**వివాదాస్పద సలహాలు.. తిరస్కరించిన గతం**

ఈ మొత్తం విలీన ప్రక్రియ వెనుక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఇచ్చిన ప్రతిపాదనలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. గతంలోనే ఆయన ఇంటర్ బోర్డును పాఠశాల విద్యలో విలీనం చేయాలని సూచించగా, అప్పట్లో స్కూల్ టీచర్లు మరియు ఉన్నత విద్యాశాఖ అధికారులు దీనివల్ల పరిపాలనాపరమైన చిక్కులు వస్తాయని భావించి తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే, ప్రస్తుత విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఆ పాత ప్రతిపాదనలనే తెరపైకి తెస్తూ మీడియా ద్వారా లీకులు ఇస్తుండటం గమనార్హం. గతంలో తిరస్కరించిన అంశాలను ఇప్పుడు అమలు చేయాలని చూడటం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని విద్యావేత్తలు నిలదీస్తున్నారు.

**పోటీ పరీక్షల సామర్థ్యంపై దెబ్బ**

ఇంటర్మీడియట్ విద్య కేవలం బోర్డు పరీక్షలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్ వంటి వాటికి పునాది వంటిది. ఇప్పటికే వేసవి కోచింగ్ పేరిట వేలాది మంది విద్యార్థులు ఇంటర్ విద్యతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పుడు బోర్డు విలీనం పేరుతో అడ్మిషన్లు నిలిపివేయడం వల్ల విద్యార్థుల అకడమిక్ క్యాలెండర్ దెబ్బతినడమే కాకుండా, వారు పోటీ ప్రపంచంలో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ అస్తవ్యస్త నిర్ణయాలు విద్యార్థుల పోటీ సామర్థ్యాన్ని క్రమంగా దెబ్బతీస్తాయని ఇంటర్ జేఏసీ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**ఇంటర్ జేఏసీ తీవ్ర ఆగ్రహం**

ప్రభుత్వం చేస్తున్న ఈ చర్యలను అత్యంత దౌర్భాగ్యమైనవిగా ఇంటర్ జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి అభివర్ణించారు. విద్యా వ్యవస్థపై కనీస అవగాహన లేని వ్యక్తులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మి రేవంత్ రెడ్డి సర్కార్ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఆయన మండిపడ్డారు. బోర్డు విలీనం వల్ల పరిపాలనా పరంగా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, దీనివల్ల విద్యా ప్రమాణాలు పడిపోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆలోచన విధానం మారకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని, విద్యార్థుల పక్షాన పోరాడుతామని జేఏసీ స్పష్టం చేసింది.

**రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ**

ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తికర చర్చ మొదలైంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వానికి కూడా ఇలాంటి అశాస్త్రీయమైన సలహాలు ఇచ్చి, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత పెంచి ఆ ప్రభుత్వం ఓటమికి ఆకునూరి మురళి పరోక్షంగా కారణమయ్యారని విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అదే వ్యక్తి తెలంగాణ ప్రభుత్వానికి కూడా అవే సలహాలు ఇస్తుండటంపై రాజకీయ విశ్లేషకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# మమత బర్తరఫ్.. బెంగాల్ గవర్నర్ ఆర్డర్స్

**కోల్ కత, మహా:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో గతకొన్ని రోజులుగా కొనసాగుతున్న హైడ్రామాకు తెరదించుతూ.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గవర్నర్ బర్తరఫ్ చేశారు. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ అధికార పీఠాన్ని వదిలేందుకు మమత నిరాకరించడంతో, రాజ్యాంగ నిబంధనల ప్రకారం గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ స్పష్టమైన ఓటమిని చవిచూసింది. ప్రజా తీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పటికీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు మమతా బెనర్జీ మొండికేయడం రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభానికి దారితీసింది. మమత వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన గవర్నర్, వేచి చూసే ధోరణి వీడి చివరకు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

# అవసరం లేకున్నా ఆపరేషన్

### యశోదా ఆస్పత్రికి రూ. 50 లక్షల భారీ జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

బాధితురాలికి రూ. 50 లక్షల పరిహారంతో పాటు, కేసు ఖర్చుల నిమిత్తం మరో రూ. 20 వేలు చెల్లించాలని స్పష్టం చేస్తూ కమిషన్ సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. త్రిపుర రాష్ట్రంలోని ఉదయ్‌పుర్‌కు చెందిన ఝుమనాథ్ గత కొంతకాలంగా తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. వైద్య పరీక్షల్లో ఆమెకు 'ఎల్ 5 ఎస్ 1 గ్రేడ్ 1 స్పాండిలోలిస్థెసిస్' (స్లిప్‌డిస్క్) సమస్య ఉన్నట్లు తేలింది. యశోదా ఆస్పత్రికి చెందిన ఓ స్పైన్ సర్జన్ త్రిపుర పర్యటనలో ఉండగా ఆమెను పరీక్షించి, శస్త్రచికిత్స చేస్తే సమస్య పూర్తిగా నయమవుతుందని భరోసా ఇచ్చారు. వైద్యుడి మాటలు నమ్మిన ఆమె, 2019 మే 16న మలక్‌పేటలోని యశోదా ఆస్పత్రిలో చేరారు. మరుసటి రోజే వైద్యులు ఆమెకు ఆపరేషన్ నిర్వహించారు. అయితే, శస్త్రచికిత్స తర్వాత ఆమె ఆరోగ్యం మెరుగుపడకపోగా మరింత క్షీణించింది. తీవ్రమైన వెన్నునొప్పికి తోడు జ్వరం, యూరిన్ ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు చుట్టుముట్టాయి. కనీసం నడవలేక, కూర్చోలేక, తన సొంత పనులు కూడా చేసుకోలేనంతగా బాధితురాలు ఇతరులపై ఆధారపడాల్సి వచ్చింది. వైద్యుల లాభాపేక్ష, నిర్లక్ష్యం వల్లే తన జీవితం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై సుదీర్ఘ విచారణ చేపట్టిన కమిషన్, వైద్యుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. సాధారణంగా గ్రేడ్ 1 స్థాయిలో ఉండే వెన్ను సమస్యలకు ఫిజియోథెరపీ, మందులతోనే చికిత్స అందించవచ్చని, శస్త్రచికిత్స అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆస్పత్రిలో సరైన ఎంఆర్ఐ స్కాన్ చేయకుండానే, కేవలం గ్రేడ్ 1 సమస్యను గ్రేడ్ 2గా మార్చి ఆపరేషన్ చేయడం కేవలం నిర్లక్ష్యమేనని కమిషన్ స్పష్టం చేసింది. వైద్యులు సంప్రదాయ చికిత్స పద్ధతులను విస్మరించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొంటూ.. ఆస్పత్రి యాజమాన్యం, సర్జన్‌లను బాధ్యులుగా చేస్తూ ఈ భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులిచ్చింది.

# ట్రాఫిక్ చట్రం ఛేదించిన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వ్యక్తం చేసిన ఆగ్రహం కేవలం హెచ్చరిక కాదు.. అది ఒక బాధ్యతాయుతమైన ఆవేదన. వెంటనే డీజీపీకి ఆదేశాలు జారీ చేస్తూ, తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ను స్తంభింపజేసే 'రాచరిక సంస్కృతి'కి చరమగీతం పాడాలని స్పష్టం చేశారు.

**అక్షరాలా అమలైన 'సింగిల్ లైన్' విప్లవం**


గురువారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్ నివాసం వరకు సీఎం ప్రయాణం సాగిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. ఎక్కడా సైరన్ల మోతతో వాహనాలను నిలిపివేయలేదు. జనంతో పాటే ప్రయాణం చేశారు. కాన్వాయ్‌కు ఒక లైన్ కేటాయించగా, మిగిలిన రహదారిపై సామాన్యుల వాహనాలు స్వేచ్ఛగా పయనించాయి. ముఖ్యమంత్రి వాహనం పక్కనే సామాన్యుల కార్లు, ఆటోలు సమాంతరంగా సాగడం చూసి నగరవాసులు పులకించిపోయారు.

**ముగిసిన వీవీఐపీ 'హడావుడి'..**

గతంలో ముఖ్యమంత్రులు వస్తున్నారంటే గంట ముందే గల్లీలన్నీ మూసేసేవారు. కానీ నేడు రేవంత్ రెడ్డి ఆ సంకెళ్లను తెంచేశారు. "రాజ్యం అంటే భోగం కాదు.. ప్రజల కష్టాలను తీర్చే యోగం. సామాన్యుడికి ఆటంకం లేని పాలనే అసలైన ప్రజాపాలన."ఈ నినాదాన్ని చేతల్లో చూపిన ముఖ్యమంత్రిపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురుస్తోంది. కాన్వాయ్ కల్చర్‌కు స్వస్తి పలికి, ప్రజల మనిషిగా నిలిచిన రేవంత్ రెడ్డి గారు నిజంగానే ఒక 'పీపుల్స్ సీఎం' అని నగరవాసులు జేజేలు పలుకుతున్నారు.

# మైనారిటీ ప్రభుత్వాలు.. కేంద్రం ఆటలు

గత పదిహేనేళ్లలో 'హంగ్' ( ఏర్పడినప్పుడు రాజ్‌భవన్ కీలకంగా మారుతోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 ప్రకారం ముఖ్యమంత్రిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. అయితే, స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు గవర్నర్ తన 'విచక్షణ అధికారాన్ని' ఎలా ఉపయోగిస్తారనేదే ఇక్కడ అసలు ట్విస్ట్. గత దశాబ్దంన్నర కాలంలో మైనార్టీ ప్రభుత్వాలు లేదా సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడిన కొన్ని కీలక సందర్భాలను విశ్లేషిస్తే:






**కర్ణాటక (2018): ఒక అర్ధరాత్రి హైడ్రామా**

అప్పట్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది (104 సీట్లు), కానీ మెజారిటీకి దూరంగా ఉంది. కాంగ్రెస్‌జేడీఎస్ కలిసి కూటమిగా ఏర్పడి తమకు మెజారిటీ ఉందని చెప్పినా, గవర్నర్ అప్పట్లో అతిపెద్ద పార్టీ నాయకుడిని (యడ్యూరప్ప) ఆహ్వానించారు. అది కేవలం కొన్ని రోజుల మైనార్టీ ప్రభుత్వంగానే మిగిలిపోయింది.

**గోవా & మణిపూర్ (2017):**
**అతిపెద్ద పార్టీకి దక్కని ఛాన్స్**

ఈ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ గవర్నర్లు మాత్రం 'అతిపెద్ద పార్టీ' కంటే, 'ముందుగా మెజారిటీ నిరూపించుకోగల కూటమి'కే మొగ్గు చూపారు. దీంతో తక్కువ సీట్లు ఉన్నా బీజేపీ ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

**తమిళనాడు ప్రస్తుత పరిస్థితికి ఇది ఎలా వర్తిస్తుంది?**

ఇప్పుడు తమిళనాడులో టీవీకే(విజయ్) అతిపెద్ద పార్టీగా ఉండి, మెజారిటీకి అడుగు దూరంలో నిలిచిన నేపథ్యంలో గవర్నర్ పాత్ర అత్యంత కీలకం కానుంది:

**గవర్నర్ ఆప్షన్ 1:**

అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకేని పిలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయమని కోరవచ్చు (సింగిల్ లార్జెస్ట్ పార్టీ రూల్).

**గవర్నర్ ఆప్షన్ 2:**

ఒకవేళ డీఎంకే కూటమిలోని పార్టీలు బయటకు వచ్చి టీవీకేతో జతకడితే, ఆ కూటమిని ఆహ్వానించవచ్చు.

**రాజ్యాంగ సంక్షోభం:**

ఎవరూ మద్దతు తెలపకపోతే, స్వల్పకాలికంగా మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపే అవకాశం ఇచ్చి, ఆపై అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోమనే 'ఫ్లోర్ టెస్ట్'కు ఆదేశించవచ్చు.

**బీజేపీ-శివసేన బంధానికి బ్రేక్**

ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నదంటే మహారాష్ట్రలోనే.. 2019లో దాదాపు 34 రోజుల పాటు అక్కడ హైడ్రామా నడిచింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై వచ్చిన విభేదాల కారణంగా దశాబ్దాల నాటి భాజపాశివసేన కూటమి విచ్ఛిన్నమైంది. అనంతరం అప్పటి అవిభజిత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్.. తన చిన్నాన్న శరద్ పవార్‌తో విభేదించి భాజపాతో చేతులు కలిపారు. అజిత్ వర్గం మద్దతు తీసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ముందుకొచ్చారు. గవర్నర్ ఇందుకు సమ్మతించడంతో ఆ ఏడాది నవంబరు 23న ఫడణవీస్ సీఎంగా.. అజిత్ డిప్యూటీగా ప్రమాణం చేశారు. కానీ, ఈ ప్రభుత్వం మూడు రోజులకే కుప్పకూలింది. వ్యక్తిగత కారణాలతో భాజపాకు గుడ్‌బై చెప్పిన అజిత్ పవార్.. తిరిగి శరద్ పవార్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అనూహ్యంగా కాంగ్రెస్, నాటి అవిభజిత శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి 'మహా వికాస్ అఘాడీ'గా ఏర్పడ్డాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఈ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 288 శాసనసభ స్థానాలున్న ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56, ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 సీట్లు వచ్చాయి.

**కర్నాటకలోనూ...**

2018లో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో మొత్తం 222 శాసనసభ స్థానాలుండగా.. ఆ ఎన్నికల్లో భాజపా 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 80, జేడీఎస్‌కు 37 సీట్లు దక్కాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 113 సీట్ల మెజార్టీ మార్క్ ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ నాటి గవర్నర్ వాజూభాయ్ వాలా.. భాజపా నేత యడియూరప్పను ఆహ్వానించారు. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో బలపరీక్ష అనివార్యమైంది. భాజపాకు సంఖ్యాబలం లేకపోవడంతో విశ్వాసపరీక్షకు వెళ్లకుండానే మూడు రోజులకే యడియూరప్ప ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం కాంగ్రెస్, జేడీఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి.

**గోవాలో కాంగ్రెస్‌కు షాక్..**

గోవాలో 40 శాసనసభ స్థానాలుండగా.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్ 17, భాజపా 13 సీట్లు గెలుచుకున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా నాటి గవర్నర్ మృదులా సిన్హా.. భాజపా నేత మనోహర్ పారికర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించగా.. చిన్న పార్టీల మద్దతుతో నాడు భాజపా సర్కారు గద్దెక్కింది.

**మణిపూర్ లోనూ..**

అదే ఏడాది (2017) మణిపూర్‌లో ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28, భాజపా 22 సీట్లు గెలుచుకున్నాయి. ఆ సమయంలో చకచకా పావులు కదిపిన భాజపా.. చిన్న పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడింది. మెజార్టీ చూపించడంతో నాటి గవర్నర్ నజ్మా హెప్తుల్లా ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించారు. దీంతో బీరేన్ సింగ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. మణిపూర్‌లో మొత్తం 60 శాసనసభ స్థానాలున్నాయి.

**అనూహ్యంగా ఆప్-కాంగ్రెస్..**

దేశ రాజధాని దిల్లీలో 70 శాసనసభ స్థానాలుండగా.. 2013లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. 31 సీట్లతో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి 28, కాంగ్రెస్‌కు 8 సీట్లు దక్కాయి. నాడు సంఖ్యాబలం లేకపోవడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు భాజపా ముందుకు రాలేదు. ఆ తర్వాత గవర్నర్.. ఆమ్ ఆద్మీ పార్టీని ఆహ్వానించారు. దీంతో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. నాడు ఆయనకు కాంగ్రెస్ వెలుపలి మద్దతు ప్రకటించింది. అయితే, ఈ ప్రభుత్వం ఎన్నో రోజులు నిలవలేదు. 49 రోజుల తర్వాత కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన ఏర్పడింది. ఆ తర్వాత 2015లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది










## హర్మూజ్‌లో శాంతి కెరటం




ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రాణనాడి వంటి హర్మూజ్ జలసంధి వేదికగా గత కొన్ని వారాలుగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడుతూ అమెరికా మరియు ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక చారిత్రక మలుపుగా నిలుస్తుంది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం కారణంగా ఈ జలసంధి దిగ్బంధనానికి గురై, ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థ స్తంభించిపోయింది. అయితే సౌదీ అరేబియాకు చెందిన అల్ అరేబియా మీడియా వెల్లడించిన కథనం ప్రకారం, ఇరు దేశాలు ఒక అడుగు వెనక్కి తగ్గి దౌత్యపరమైన పరిష్కారానికి మొగ్గు చూపడం విశేషం. అమెరికా తన నౌకాదళ దిగ్బంధనాన్ని క్రమంగా సడలించే కొద్దీ, ఇరాన్ కూడా హర్మూజ్‌ను తెరిచి అంతర్జాతీయ నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేయాలన్నది ఈ ఒప్పందం యొక్క సారాంశం. ఈ పరిణామం వెనుక డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన వ్యూహాత్మక దౌత్యం స్పష్టంగా కనిపిస్తోంది. చర్చలు సానుకూల ధోరణిలో సాగుతున్నాయని, యుద్ధం త్వరలోనే ముగుస్తుందని ఆయన వ్యక్తం చేసిన ఆశాభావం ఇప్పుడు వాస్తవరూపం దాలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో, ఇంధన రవాణాలో మూడో వంతు వాటా కలిగిన ఈ మార్గాన్ని పునరుద్ధరించడం అంటే ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని నివారించడమే అవుతుంది. యుద్ధ క్షేత్రంలో తలపడుతున్న దేశాలు సైతం ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా రాజీకి రావాల్సిన అనివార్యతను ఈ ఒప్పందం గుర్తు చేస్తోంది. రానున్న కొన్ని గంటల్లోనే జలసంధిలో నిలిచిపోయిన వందలాది నౌకలు విడుదల కానుండటం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. అయినప్పటికీ, ఈ తాత్కాలిక ఊరట శాశ్వత శాంతికి దారితీస్తుందా అన్నది వేచి చూడాలి. ఇజ్రాయెల్ భద్రతా పరమైన ఆందోళనలు మరియు ఇరాన్ మధ్య ప్రాంతీయ ఆధిపత్య పోరు ఇంకా పూర్తిగా సమసిపోలేదు. కానీ, ప్రస్తుతానికి యుద్ధ తీవ్రతను తగ్గించి, ప్రపంచ ఇంధన అవసరాలను తీర్చే దిశగా అమెరికాఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. హర్మూజ్ జలసంధిలో నౌకల ఇంజన్ల శబ్దం మళ్ళీ వినిపించడం అంటే అది కేవలం వ్యాపార పునరుద్ధరణ మాత్రమే కాదు, విధ్వంసం అంచున ఉన్న మధ్యప్రాచ్యంలో దౌత్యం సాధించిన ఒక గొప్ప విజయంగా పరిగణించవచ్చు. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే, ప్రపంచ మార్కెట్లు స్థిరపడటమే కాకుండా అగ్నిగుండంలా మారిన ఈ ప్రాంతంలో శాంతి చర్చలకు మరింత బలం చేకూరుతుంది.

# అందరికీ వాయింపే

### తమిళ ఓటరు 'షాక్' ట్రీట్మెంట్!.. నిద్రలేదు.. సుఖం లేదు
### డీఎంకేకు షాక్ .. అన్నాడీఎంకేకు చెక్. టీవీకేకు టెస్ట్



**చెన్నై, మహా:** చెన్నై నగరంలో ఎండ కంటే రాజకీయ వేడే ఎక్కువగా ఉంది. ఏ పార్టీ ఆఫీసులో చూసినా ముఖాలు మాడిపోయి కనిపిస్తున్నాయి. గెలిచిన వారికి సంతోషం లేదు, ఓడిన వారికి నిద్ర లేదు. తమిళ ప్రజలు ఈసారి తీర్పును ఒక పజిల్ లాగా విసిరారు. రిసార్టు రాజకీయాలు, అర్థరాత్రి మంతనాలు, గవర్నర్ వైఖరి.. వెరసి తమిళ రాజకీయ తాళింపు ఇప్పుడు మరింత ఘాటుగా మారింది. అధికారం పోయినా, వచ్చినా టెన్షన్ మాత్రం అందరికీ కామన్ అయిపోయింది.

**నిజంగానే ఇది "అందరికీ వాయింపే!"**

డీఎంకే కూటమి: అధికారం పోయె.. ఊపిరి ఆడదాయె! పాపం, అధికారంలో ఉన్న డీఎంకే కూటమికి ప్రజలు గట్టిగానే 'వాయించారు'. అధికారం నుంచి దించేయడమే కాకుండా, ఆ కూటమిలోని పార్టీల మధ్య చిచ్చు పెట్టారు.

**ప్రస్తుత పరిస్థితి:**

ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడి చూస్తుంటే, డీఎంకే మిత్రపక్షాలు ఎప్పుడెప్పుడు ఆ కూటమి నుంచి బయటపడి విజయ్ వైపు వెళ్దామా అని చూస్తున్నాయి.

**టెన్షన్:**

అధికారం పోయిన బాధ ఒకవైపు ఉంటే, ఉన్న పార్టీలు కూడా జారిపోతాయేమో అన్న భయం నేతలను ప్రశాంతంగా ఉండనివ్వడం లేదు.

**అన్నాడీఎంకే: కుర్చీ దక్కలేదు.. పార్టీ మిగిలేలా లేదు!**

అన్నాడీఎంకే పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి' అన్నట్టుగా ఉంది. 47 సీట్లు గెలిచామని సంబరపడేలోపే, అందులో సగానికి పైగా ఎమ్మెల్యేలు 'మహా' (మహాబలిపురం) రిసార్టుల వైపు చూపులు చూస్తున్నారు.

**చీలిక భయం:**

పార్టీని కాపాడుకోవాలా? లేక విపక్షంలో ఉండి పోరాడాలా? అన్న క్లారిటీ లేక నేతలు తలలు పట్టుకుంటున్నారు. అధికారం రాలేదన్న నిరాశ కంటే, పార్టీ ముక్కలైపోతుందన్న ఆందోళనే ఇప్పుడు పెద్ద సమస్య.

**టీవీకే : గెలుపు గుర్రం.. కానీ గమ్యం దూరం!**

తమిళనాడు రాజకీయ తెరపై విజయ్ సంచలనం సృష్టించారు. అతిపెద్ద పార్టీగా అవతరించారు. కానీ, ప్రజలు అక్కడ కూడా ఒక చిన్న మెలిక పెట్టారు.

**అడుగు దూరంలో మెజారిటీ:**

మ్యాజిక్ ఫిగర్ కు అడుగు దూరంలో ఆగిపోవడంతో, ఇప్పుడు ఇతర పార్టీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి.

**సవాలు:**

కింగ్ మేకర్లు ఎవరు? మద్దతు ఇచ్చేందుకు వారు పెట్టే షరతులు ఏంటి? ఈ గందరగోళంలో 'తలపతి'కి కూడా సుఖం లేకుండా పోయింది.

# గవర్నర్ తీరు రాజ్యాంగ విరుద్ధం..

## విజయ్‌కు అండగా ప్రకాష్ రాజ్

తమిళనాడు రాజకీయాల్లో గత ఐదు దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి గండికొడుతూ, నటుడు విజయ్ తన 'తమిళగ వెట్రి కజగం' (TVK) పార్టీతో సంచలన విజయం నమోదు చేశారు. అయితే, ఈ చారిత్రాత్మక గెలుపును ఆస్వాదించే లోపే విజయ్‌కు ఊహించని రాజకీయ ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. హంగ్ అసెంబ్లీ ఏర్పడిన నేపథ్యంలో, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీని నిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆదేశించడంతో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగింది.

**గవర్నర్ తీరుపై ప్రకాష్ రాజ్ నిప్పులు**

విజయ్ రాజకీయ సిద్ధాంతాలతో తనకు విభేదాలు ఉన్నాయని బహిరంగంగానే చెప్పే నటుడు ప్రకాష్ రాజ్, ఈ సంక్షోభ సమయంలో మాత్రం 'దళపతి'కి అండగా నిలిచారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రతినిధులను కాదని, నియామక పదవిలో ఉన్న గవర్నర్ ఇలా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన మండిపడ్డారు. "గవర్నర్ ప్రవర్తన అత్యంత అసహ్యకరం. ఇది రాజ్యాంగ విరుద్ధం. మా మధ్య సిద్ధాంతపరమైన తేడాలు ఉండవచ్చు.. కానీ విజయ్‌కు ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. సభలో తన బలాన్ని నిరూపించుకునే అవకాశం ఆయనకు కల్పించాలి" అని ప్రకాష్ రాజ్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో "ప్రజల తీర్పును గౌరవించండి, విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయనివ్వండి" అంటూ 'జస్ట్ ఆస్కింగ్' (#justasking) హ్యాష్‌ట్యాగ్‌తో గవర్నర్ వైఖరిని ప్రశ్నించారు.

**నెంబర్ గేమ్:**

విజయ్ ఎక్కడ విఫలమవుతున్నారు? మే 4న



వెలువడిన ఫలితాల ప్రకారం, 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకున్న తర్వాత ఈ కూటమి బలం 113కు చేరింది. అయితే, అధికారం చేపట్టడానికి అవసరమైన 'మేజిక్ ఫిగర్' 118కి ఇంకా 5 స్థానాల దూరంలో ఉంది. మెజారిటీ నిరూపించుకోవడానికి మద్దతు ఇచ్చే ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన జాబితాను సమర్పించాలని గవర్నర్ కోరడంతో విజయ్ మంతనాలు జరుపుతున్నారు. ఈ పరిణామాలపై బీజేపీ నాయకులు స్పందిస్తూ ఇది 'చీలిక తీర్పు' (Fractured Verdict) అని వ్యాఖ్యానిస్తుండగా, విజయ్ తన సన్నిహితులతో కలిసి న్యాయపరమైన సలహాలు తీసుకుంటున్నారు.

**సినిమాలకు గుడ్ బై.. రాజకీయాలే లోకం**

రాజకీయాల్లో అనూహ్య విజయం సాధించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో ప్రజా సేవకే పరిమితం కానున్నారు. ఆయన నటించిన చివరి చిత్రం 'జననాయగన్' (Jana Nayagan) సెన్సార్ ఇబ్బందుల వల్ల ఇంకా విడుదల కాలేదు. గత నెలలోనే ఈ సినిమా హెచ్‌డీ ప్రింట్ ఆన్‌లైన్‌లో లీక్ కావడం కలకలం సృష్టించింది. ఒకవైపు సినిమా చిక్కులు, మరోవైపు రాజ్యాంగ సంక్షోభం మధ్య విజయ్ ముఖ్యమంత్రి పీఠంపై ఎప్పుడు కూర్చుంటారనేది ఇప్పుడు కోలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు హాట్ టాపిక్‌గా మారింది.

## స్నేహ సమ్మర్ క్యాంపులను విజయవంతం చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లాలో స్నేహ సమ్మర్ క్యాంపుల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారుల కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్ని లైన్ డిపార్ట్మెంట్లు సమన్వయంతో పనిచేసి స్నేహ సమ్మర్ క్యాంపులను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాంపుల నిర్వహణలో జూన్ 10 వరకు నిర్వహించనున్న విద్య, వైద్య, సంక్షేమ, పంచాయతీరాజ్ తదితర శాఖలు సమగ్రంగా సహకరించాలని సూచించారు. పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో డీఆర్డీఓ, నాగ పద్మజ, అదనపు డీఆర్డీఓ రేణుక , డీఈఓ, డీడబ్ల్యూఓ రేణుక , డీఎంహెచ్వో, జిల్లా పంచాయతీ అధికారి కల్పన , జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

- యువతి, యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**మహా వరంగల్ బ్యూరో;** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జాబ్ మేళా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖలఅధికారుల తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 60 కంపెనీలు ఉద్యోగ అవకాశాల కల్పనకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కాళోజి కళాక్షేత్రం వేదికగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) వై.వి. గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి రమేష్, జీఎం ఇండస్ట్రియల్ నరసింహమూర్తి, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు శ్రీకాంత్, ఇక్బాల్, డీఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీసీఎస్ఓ కిష్టయ్య, మెప్మా రేణుక తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- టీజీ ప్రధాన జనగణన అధికారి, డైరెక్టర్, సంచాలకులు భారతి హోళికేరి
- రాష్ట్ర వ్యాప్త కలెక్టర్లు అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



**మహా వరంగల్ బ్యూరో;** జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన జనగణన అధికారి, సంచాలకులు భారతి హోళికేరి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళికేరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని, 10వ తేదీలోగా ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్ లు, గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు. స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఇండ్ల గణన శిక్షణకు పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు. బల్దియా ప్రధాన కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బల్దియా ప్రత్యేకాధికారి జిల్లా ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి చాహత్ బాజ్ పాయ్ విడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11 వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో విధులు నిర్వహించే ఎన్యూమరేటర్లు సూపర్ వైజర్ లకు అన్ని స్థాయిలలో శిక్షణ ను పూర్తి చేసుకున్నారని, స్వీయ గణన ప్రోత్సహించడానికి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నామని, ప్రజలందరికీ అవగాహన కలిగించే విధం గా నేడు(శుక్రవారం) ఎంజీ ఏం కూడలి నుండి వెయ్యి స్తంభాల ఆలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. బల్దియా వ్యాప్తం గా సుమారు 1700 మంది ఎన్యూమరేటర్ లు, సూపర్ వైజర్ లు ఇట్టి గణన లో పాల్గొంటారని, 6 ఎన్యూమరేటర్ ల పై పర్యవేక్షణ కు ఒక సూపర్ వైజర్ ను నియమించామని ఈ సందర్భం గా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం లో అదనపు ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి చంద్రశేఖర్ ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి బిర్రు శ్రీనివాస్ టి ఎం సి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమంతోనే పారిశ్రామికాభివృద్ధి

**చర్లపల్లి ఐల్లా చైర్మన్ గోవింద్ రెడ్డి**

**కుషాయిగూడ, మహా :** పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులు, యాజమాన్యాలు పరస్పర అవగాహనతో ముందుకు సాగితేనే పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని చర్లపల్లి ఐల్లా చైర్మన్ కె.గోవింద్ రెడ్డి అన్నారు. స్థానికంగా రోడ్లు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో త్వరలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలిపారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐఈయూ) ఆధ్వర్యంలో మేడే సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు గురువారం సూరన చౌరస్తాలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సిఐఈయూ అధ్యక్షుడు బి.వి. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. మేడే స్ఫూర్తిని కేవలం సభలకే పరిమితం చేయకుండా కార్మికుల్లో ఐక్యత, చైతన్యం పెంపొందించేలా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు స్నేహపూర్వక వాతావరణంలో పనిచేస్తూ సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని సూచించారు. సిఐఈయూ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాట, వారిలో ఐక్యత పెంపొందించే దిశగా పనిచేస్తోందని కొనియాడారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం, సంబంధిత శాఖలతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్లు, విద్యుత్ దీపాలు, ఇతర సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి పి.గణేష్ మాట్లాడుతూ.. కార్మికుల మధ్య ఐక్యత, స్నేహభావం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. దేశంలో కార్మిక హక్కులపై దాడులు పెరుగుతున్నాయని, కార్మిక చట్టాలను బలహీనపరిచే ప్రయత్నాలను ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల అభివృద్ధిలో కార్మికుల శ్రమకు ప్రధాన పాత్ర ఉన్నప్పటికీ వారికి తగిన గౌరవం, భద్రత, సంక్షేమం కల్పించడంలో యాజమాన్యాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లు, విద్యుత్ దీపాలు, పరిశ్రమల్లో ఈఎస్ఐ, పీఎఫ్ అమలు తదితర అంశాలను ప్రస్తావించారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన కార్మికులకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. పోటీల్లో 11 క్రికెట్ జట్లు, 6 వాలీబాల్ జట్లు, 6 షటిల్ జట్లు పాల్గొన్నాయి. క్రికెట్ ఫైనల్లో ఎఎస్పి రోప్ జట్టుపై కెవిఆర్ జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి మేడే కప్‌ను కైవసం చేసుకుంది. వాలీబాల్‌లో ఎస్ఎస్ఏ రోప్‌పై కెవిఆర్ జట్టు గెలుపొందగా, షటిల్‌లో సిఐఏ, ఎపిరాక్ జట్లు విజేతలుగా నిలిచాయి. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారి ఎం.ఎస్.రావు వందన సమర్పణ చేశారు. చర్లపల్లి లోని వివిధ పరిశ్రమల యూనియన్ నాయకులు కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి, ఏపీరాక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.మణికంఠ, గండూరి ఫుడ్స్ ప్రధాన కార్యదర్శి టి.రవీందర్ రెడ్డి, ఎస్పీఎం ప్రధాన కార్యదర్శి టి.నరసింహ, థైసెన్‌క్రుప్ ప్రధాన కార్యదర్శి కె.బాలరాజు, ఆశీస్ క్రేన్ ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, ఐక్యూబ్ ప్రధాన కార్యదర్శి కె.సంతోష్, 3డి ఫోమ్ కట్ ప్రధాన కార్యదర్శి బి.ఆదామ్, పెద్ద ఎత్తున కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## జిడబ్ల్యూఎంసి ప్రత్యేక అధికారిగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

- జీడబ్ల్యూ ఎంసి ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ
- పాలన పై ప్రత్యేక అధికారి ఫోకస్
- అభివృద్ధి పనులు సకాలం లో పూర్తి చేయాలని వింగ్ అధికారులకు ఆదేశం



**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు చేపట్టారు.మే 6 వ తేదీ తో పాలక వర్గ సభ్యుల పదవి కాలం ముగియడం తో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు హన్మకొండ జిల్లా కలెక్టర్ జిడబ్లుఎంసి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం వివిధ విభాగాల ఉన్నతాధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశం లో కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి పలు ముఖ్యమైన ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని తెలిపారు. పనుల అమలులో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట వెంటనే స్పందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టెండర్లు, ప్రాజెక్టు ప్రతిపాదనలు, మంజూరైన నిధుల వినియోగం వంటి అంశాల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన అమలు ఉండాలని సూచించారు.పెద్ద ఎత్తున అభివృద్ధి ప్రాజెక్టులు త్వరలో ప్రారంభం కానున్నాయని, వాటి ద్వారా నగరానికి మరింత మౌలిక సదుపాయాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా రహదారులు, పారిశుద్ధ్యం మౌలిక వసతుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం లో ప్రజా ఫిర్యాదులకు తక్షణం స్పందించి పరిష్కరించాలని , ఫైళ్లు ఎక్కడా నిలిచిపోకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో సమన్వయంతో పనిచేస్తేనే నగర అభివృద్ధి వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డ కలెక్టర్ ,సి ఎన్ డి ప్రాజెక్ట్ ను ఏజెన్సీ నిర్వాహకులతో సంప్రదించి వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అందుకు కావలసిన మౌలిక వసతులు కల్పించాలన్నారు. యు జీ డి ప్రాజెక్ట్ డి పి ఆర్ అంతిమ దశకు చేరుకున్నందున ఇంజనీరింగ్ అధికారులు అందుకు అవసరమైన సూచనలు చేయాలని అన్నారు. బాల సముద్రం లో బల్దియా నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ నిర్వహణ తీరును అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్వహణ తీరును పరిశీలించి సమర్థవంతంగా కొనసాగేలా చూడాలని అన్నారు. బయో సి ఎన్ జీ ఏర్పాటు కు నోటిఫికేషన్ ఇవ్వాలని,వడ్డేపల్లి బండ్ పై అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులు వేగం గా పూర్తి చేసేలా చూడాలని అన్నారు.టాక్స్ కలెక్షన్ నిర్వహణ వ్యవస్థలను క్రమబద్ధీకరించాలని, సుమారు రూ. 100 కోట్ల విలువైన పెద్ద ప్రాజెక్టులు వేగంగా అమలు అయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి సమ్మయ్య ఏం హెచ్ ఓ డా.రాజేష్ ఈ ఈ లు రవి కుమార్ సంతోష్ బాబు,మహేందర్ మాధవి లత తదితరులు పాల్గొన్నారు.

### మురుగు నీటిని నిల్వ ఉంచకుండా

## ప్రత్యేక శ్రద్ధ వహించండి

- చాకలికుంట చెరువులో మస్కిటో లార్వి సైడ్ బాల్స్ విడుదల
- కీసర డిప్యూటీ కమిషనర్ ఎన్ వసంత

**కుషాయిగూడ, మహా :** కాలనీలు ఖాళీ ప్రదేశాలలో మురుగు నీటిని నిల్వ ఉంచకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే దోమల వ్యాప్తిని నివారించవచ్చునని కీసర డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కీసర డిప్యూటీ కమిషనర్ వసంత గురువారం ఎంటమాలజీ విభాగం పనితీరును అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీసర డివిజన్ చాకలికుంట చెరువులో దోమ లార్వా అభివృద్ధి చెందకుండా మస్కిటో లార్విసైడ్ ఆయిల్ బాల్స్ ను విడుదల చేశారు. అలాగే స్నేహ కాలనీలో ఇంటింటికి దోమల నివారణకు మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ, దోమ మనుషులను కరిచినప్పుడు అవి మనుషులతో చేరి వారి లివర్లో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్త కణాలను నాశనం చేస్తాయని ఎర్ర రక్తకణాలలో చేరిన 48 నుండి 72 గంటలలో ఈ పరాన్న జీవులు విభజన చెందిపోతాయన్నారు. దీనివలనూర్ జ్వరం వణుకుడితో కూడిన జ్వరం అసాధారణ రక్తస్రావం దీర్ఘస్వాస రక్తలేమి చిహ్నాలు స్పృహ కోల్పోవడం జరుగుతుందన్నారు. చలి జ్వరము తలనొప్పి కండరాల నొప్పి, చాతిలో నొప్పిగా ఉండడం దగ్గు చెమటలు పట్టడం వాంతులు విరేచనాలు నీరసంగా ఉండడం ఆయాసం మొదలైన మలేరియా లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం వల్ల మెరుగైన చికిత్స అందించవచ్చని తెలిపారు. దోమ కాటుకు గురైన 7 నుండి 18 రోజుల మధ్య ఈ లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కోపిక్ లాబరేటరీ టెస్టులు లేదా ఆర్టీసీ టెస్టుల ద్వారా మలేరియా వ్యాధిని నిర్ధారిస్తారని తెలిపారు. అందువలన దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చునని తెలిపారు. అనంతరం ఎంటమాలజీ సిబ్బందికి కీసర డివిజన్లో దోమల నివారణకు ఎప్పటికప్పుడు విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు భాస్కర్, తిరుపతి, రాజు, శ్రీనివాస్, స్వామి, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖబర్దార్ కేటీఆర్ భాష మార్చుకో...

- సీఎంను విమర్శించే స్థాయి నీకు ఉందా?
- వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ బుధవారం వరంగల్ జిల్లా లో రైతు సభ ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషించిన కేటీఆర్ ఖబర్దార్ అంటూ హెచ్చరిస్తూ ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి నీకు ఉందా.. అంటూ కేటీఆర్ వ్యాఖ్యల పై అయూబ్ మండిపడ్డారు. తెలంగాణను అధికారం పేరుతో అడ్డంగా దోచుకుని బలిసి రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకొని హౌలే గాడు అనడం ఎంతవరకు సమంజసం కాదని కేటీఆర్ డ్రగ్స్ వాడడం వల్ల పూర్తిగా మతిభ్రమించి ఏం మాట్లాడుతున్నాడో తెలియక అవాకులు చవాకులు పెట్టిన కేటీఆర్ పై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. కేటీఆర్ ముందుగా నిజాలు తెలుసుకోవాలని అసలు రైతు సభ పెట్టే నైతిక హక్కు కూడా లేదని స్పష్టం చేశారు. గత మీ ప్రభుత్వంలో వరేసుకుంటే ఉరేనని మీ తండ్రి కెసిఆర్ చెప్పలేదా అని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాలు ఇస్తామని మోసం చేసి దళిత ముఖ్యమంత్రి అని చెప్పి మోసం చేసి కేజీ టు పీజీ ఉచిత విద్యను మోసం చేసి రైతులకు బేడీలు వేసిన నీచమైన చరిత్ర మీది కాదని గుర్తు చేశారు. అదే విధంగా 2014 నుంచి 2023 వరకు తెలంగాణ రాష్ట్రంలో 641 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నది వాస్తవం కాదా ? ఇలాంటి నీచమైన పరిపాలన చేసిన మీరు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిని హౌలే అనడం సిగ్గుచేటు అని మొదట నీవు మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి చికిత్స చేయించుకో ఆ ఖర్చు కూడా మేమే భరిస్తాం అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నత చదువులు చదువుకున్న నీవు ఇలాంటి మాటలు మరొకసారి మాట్లాడితే అసలు తెలంగాణలోనే నిన్ను తిరగనివ్వమని అయూబ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట అధ్యక్షులు ఎద్దు సత్యం, తూల రవి గీసుకొండ మండల అధ్యక్షుడు శ్రీనివాసు దాడి శివ సంఘ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి ఇండ్ల రవి, ఈగ దామోదర్, నాంపల్లి యాదగిరి, జన్ను అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

### వైన్ షాప్ ల వద్ద ట్రాఫిక్ కష్టాలు

## చర్యలు తీసుకోండి

**జిల్లా సిపిఐ ఇంచార్జ్ తోటపల్లి శంకర్**



కుషాయిగూడ, మహా : జవహర్ నగర్ ప్రధాన రహదారుల వద్ద ఉన్న వైన్ షాపుల దగ్గర అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను నివారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని జవహర్ నగర్ పరిధిలోని వివిధ వైన్ షాప్ ల వద్ద ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై సిపిఐ ఆధ్వర్యంలో జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ కు గురువారం తోటపల్లి శంకర్ పార్టీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నిలపడం వల్ల అటుగా వెళ్లే బస్సులు ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయని ముఖ్యంగా పాదచారులు నడవడానికి కూడా వీలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జవహర్ నగర్ పోలీస్ ట్రాఫిక్ నిర్వహణ బాగానే ఉన్నప్పటికీ ఈ నిర్దిష్ట ప్రాంతాల్లో వైన్ షాప్ ల యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైన్ షాపుల యాజమాన్యాలు పార్కింగ్ సౌకర్యం కల్పించకుండా రోడ్లను ఆక్రమించడం చట్టం విరుద్ధమని తక్షణమే పోలీసులు స్పందించి సదరు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప నాయక్, గిరి ప్రసాద్ నగర్ కార్యదర్శి కొండా సత్యం సాగర్, ఏఐటీయూసీ నాయకులు అంబాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్స్పెక్టర్ల బదిలీ

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్స్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ప్రస్తుతం కాజీపేట ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డిని శాయంపేట సిఐ గా బదిలీ చేయగా, ఏ హెచ్ టి యు ఇన్స్ స్పెక్టర్ జె. శ్యామ్ సుందర్ కాజీపేట కు, పిసిఆర్ లో పనిచేస్తున్న ఏ. మహేందర్ ను హసన్ పర్తి కి బదిలీ చేయగా ప్రస్తుతం హసన్ పర్తిలో విధులు నిర్వహిస్తున్న వి. చేరాలు ను వి. ఆర్ బదిలీ చేయడం జరిగింది.



## కుడా ఉద్యోగిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు, కుడా చైర్మన్

**మహా వరంగల్ బ్యూరో;** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కుడా ఉద్యోగి ఎర్ర శ్రీనివాస్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ లోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న హనుమకొండ డీసీసీ అధ్యక్షులు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి శ్రీనివాస్ ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడి, అందుతున్న వైద్యం గురించి, మెరుగైన చికిత్స కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

### నేడు పెదమంగళ్లారంలో

## పశు ఆరోగ్య శిబిరం

**పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్**

**మొయినాబాద్ మహా:** ప్రజాపాలన ... ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశు గర్భకోశవ్యాధి మరియు పశు ఆరోగ్య శిభిరం మొయినాబాద్ మున్సిపాలిటీ లోని పెదమంగళ్లారం లో శుక్రవారం రోజున నిర్వహించడం జరుగుతుందని పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ తెలిపారు కావున పెద్దమంగళారం పాడి రైతులు, గొర్రెల&మేకల కాపరులు , రైతులు అధిక సంఖ్యలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

### పిల్లలతో సహా గృహిణి

## అదృశ్యం

**పిఎస్‌లో ఫిర్యాదు చేసిన తల్లి**

**కుషాయిగూడ, మహా :** పిల్లలతో సహా గృహిణి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం జవహర్ నగర్ బి జె ఆర్ నగర్ కు చెందిన రొయ్యల మహిమా రాణి (25) స్థానిక బిజెఆర్ కాలనీలో నివాసం ఉంటుంది. మహిమారాణి ఈనెల 7వ తేదీన కుమార్తె బ్లేస్సి కుమారుడు ప్రేమ్ జోష్వాతో ఉదయం 11 గంటలకు కారులో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయిందని మహిమా రాణి గురించి చుట్టుపక్కల వెతికిన తెలిసిన వారి వద్ద వెతికిన బంధువుల వద్ద సమాచారం లభించలేదు. ఈ మేరకు మహిమా రాణి తల్లి రొయ్యల లక్ష్మి జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు విస్తరణ- ఇంకెన్నాళ్లు..

- నిధులు ఉన్నా నత్తనడకన రోడ్డు పనులు..
- దుమ్ము ధూళిలో వాహనదారుల ప్రయాణాలు...



**రాజేంద్రనగర్, మహా ;** నిధులు ఉన్న శంషాబాద్ నుంచి రాళ్లగూడ మీదగా హైతాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాకు రహదారుల విస్తరణ పనులు గత సంవత్సరం నుంచి నత్త నడకన సాగుతున్నాయి.2025 లో మొదలైన రోడ్డు విస్తరణ పనులు. 2026 వరకు కొనసాగుతున్నాయి.120 ఫీట్ల రోడ్డుతో మొదలై 80 ఫీట్లవరకు రోడును కుదించారు. ఉన్న కాస్త రోడ్డును తొలగించి రోడ్డు పనులు చేపట్టారు. చేపట్టి నెలలుగా గడుస్తున్నా పూర్తి కావడంలేదు. తార్ రోడు పూర్తి చేయవలసిన సమయంలో కంకరతో సరిపెట్టారు. నెలలు గడుస్తున్న రోడ్డు పూర్తి కాక పోవడంతో శంషాబాద్ నుంచి హైతా బాద్ వెళ్లే వాహనదారులు దుమ్ము దుళిలో ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర వేసిన చోట దుమ్ము ధూళి లేవకుండా నీరు కూడా పోయకపోవడంతో వాహనదారులు అనేక ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. నిధులు ఉన్న రోడ్డు పనులు ఇంకెన్నాళ్లు చేస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో తిరిగే వాహనాలు కంకర రోడ్డుపైన నడవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు డామేజ్ అవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు పూర్తి చేయకపోతే వచ్చేది వర్షాకాలం వేసిన కంకర వర్షంలో కొట్టుకపోక ముందే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి. ఉన్న రోడ్డును తో వేశారు, రహదారుల నిర్మాణాన్ని గాలి వదిలేశారు. లేని పోని ఇబ్బందులకు గురి చెయ్యొద్దని వాహనదారులు మండిపడుతున్నారు.

### ఐజీ కాలనీ డ్రైనేజీ సమస్యపై

## ఎమ్మెల్యే చర్యలు


**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి ఐజీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్యలు చేపట్టారు. ఈ మేరకు హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్ రెడ్డిని కలిసి సమస్య తీవ్రతను వివరించారు. 2009లో జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద నిర్మించిన సుమారు 1200 ఇళ్లతో కూడిన ఐజీ కాలనీలో అప్పట్లో ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. దీంతో మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. సమస్య పరిష్కారం కోసం కాలనీ వాసులు పలుమార్లు జీహెచ్ఎంసీ, నీటి సరఫరా సంస్థ అధికారులను ఆశ్రయించినప్పటికీ శాఖల మధ్య బాధ్యతలపై స్పష్టత లేకపోవడంతో చర్యలు చేపట్టలేదన్నారు. ఐజీ కాలనీలో కొత్త డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యను అత్యవసరంగా పరిగణించిన ఎండీ అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నీటి సరఫరా సంస్థ కార్యనిర్వాహక డైరెక్టర్ పంకజను కలిసి సమస్యపై చర్చించారు. త్వరలోనే పనులను పరిశీలించి మంజూరు ప్రక్రియ చేపడతామని ఆమె తెలిపినట్లు సమాచారం.

## పీవీఎన్ఆర్ ఫ్లైఓవర్ పై పల్టీలు కొట్టిన కారు

**పలువురికి గాయాలు.. భారీగా ట్రాఫిక్ జామ్**

**రాజేంద్రనగర్, మహా:** రాజేంద్రనగర్ పరిధిలోని పీవీఎన్ఆర్ ఫ్లైఓవర్ పై గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ ఎండి షఫీయాన్ అర్షక్,షిఫ్ట్ ఎస్ క్రాస్ కారులో ఇద్దరు స్నేహితులు అల్తాఫ్, అబ్దుల్లాతో కలిసి మెహదీ పట్నం నుండిఅరాంఘర్ వైపు వెళ్తున్న క్రమంలో పివిఎన్ఆర్ పిల్లర్ నెంబర్ 150 వద్ద అతివేగంగా ప్రయాణిస్తూన్న కారు డివైడర్ను ఢీకొనడంతో కారు పల్టీలు కొట్టి, రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ మెహదీ పట్నం నుంచి వచ్చే మార్గం ట్రాఫిక్ తో జామ్ అయింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ని క్లియర్ చేసి ముగ్గురిని ఆసుపత్రికి తరలించారు.



## ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫోక్సోకేస్ నమోదు: రిమాండ్.!




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫోక్సోకేస్ నమోదయిందని పోలీసులు తెలిపారు. ఆదిభట్ల మున్సిపల్ సర్కిల్ పరిధిలోని ఓ గ్రామంలో మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, ఫోక్సో కేస్ లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

## రైతు సంక్షేమమే ధ్యేయం పాలకుర్తిలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రస్థానం



**పాలకుర్తి :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు వారం కార్యక్రమం గురువారం స్థానిక రైతు వేదికలో ఉత్సాహంగా జరిగింది.ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయ అధికారులు రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించారు.సన్న బియ్యం రకాలపై ప్రత్యేక దృష్టి ప్రధానంగా రైతులు అధిక ఆసక్తి కనబరిచే 8 రకాల సన్న బియ్యం రకాల గురించి అధికారులు ఈ సమావేశంలో వివరించారు.విత్తన ఎంపిక నుంచి పంట కోత వరకు రైతులు పాటించాల్సిన మెలకువలను వివరిస్తూ,వారి సందేహాలను ముఖాముఖి ద్వారా నివృత్తి చేశారు. నేల ఆరోగ్యం నానో యూరియా వినియోగం నేల ఆరోగ్య పరిరక్షణకు మట్టి నమూనాల సేకరణ,సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ ప్రాధాన్యతను అధికారులు చెప్పారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సమతుల్య ఎరువుల యాజమాన్యం మరియు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం దెబ్బతినకుండా ఉండే మార్గాలను సూచించారు. వీటితో పాటు ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంచడంపై రైతులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, మండల వ్యవసాయ అధికారి AO శశిధర్, విద్యుత్ శాఖ అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామ రైతులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఎన్నికల్లో మల్కా రామస్వామి ప్యానల్ చేతిలో చేయి గుర్తు ప్రభంజనం



**పాలకుర్తి:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ పర్మినెంట్ కార్మిక సంఘం ఎన్నికల్లో మల్కా రామస్వామి ప్యానల్ సృష్టించిన సునామీకి ప్రత్యర్థులు అడ్రస్ లేకుండా పోయారు. ఉత్కంఠగా సాగిన ఈ పోరులో కార్మికులు ఏకపక్ష తీర్పునిస్తూ, రమేష్ మౌరియాను భారీ మెజారిటీతో గెలిపించి తమ అజేయ శక్తిని చాటారు.

**ఓట్ల లెక్క.. విజయ ఢంకా.**

మొత్తం 309 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోగా, ఫలితాలు చూసి పారిశ్రామిక వర్గాలు విస్మయానికి గురయ్యాయి.విజేత: మల్కా రామస్వామి ప్యానల్ (చేతిలో చేయి గుర్తు) - రమేష్ మౌరియా: 166 ఓట్లు

బయ్యాపు మనోహర్ రెడ్డి ప్యానల్ (ఆటో గుర్తు) - పోతుల ప్రసాద్: 91 ఓట్లు

నల్ల మనోహర్ రెడ్డి ప్యానల్ (గులాబీ పువ్వు గుర్తు) - శ్రీనివాస్: 48 ఓటు

**విశేషం:** పోలైన ఓట్లలో 60% పైగా ఓట్లను సాధించి రమేష్ మౌరియా రికార్డు సృష్టించారు.సంక్షేమానికే పట్టం.బోనస్‌లు, ఉద్యోగ భద్రత, కార్మికుల హక్కులే ధ్యేయంగా బరిలోకి దిగిన మల్కా రామస్వామి ప్యానల్‌పై కార్మికులు పూర్తి నమ్మకాన్ని ప్రకటించారు. ఇది కార్మికుల విజయం.నమ్మకానికి దక్కిన గౌరవం అంటూ కార్మిక నేతలు హర్షం వ్యక్తం చేశారు.హోరెత్తిన సంబరాలు ఫలితాలు వెలువడగానే అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ పరిసరాలు పండగ వాతావరణాన్ని తలపించాయి. మల్కా రామస్వామి వర్గీయులు,కార్మికులు భారీ ఎత్తున పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

## కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఆకుల నరసయ్య ..

**వైస్ చైర్మన్ తో పాటు డైరెక్టర్ల నియామకం..**



**కరీంనగర్ మహా :** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి తెలంగాణ ప్రభుత్వం కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ గాసీనియర్ కాంగ్రెస్ నాయకుడు అకుల నర్సయ్య, వైస్ చైర్మన్ గా సుదగోని లక్ష్మీనారాయణ గౌడ్ నియమితులయ్యారు. మార్కెట్ కమిటీ సభ్యులుగా పంజాల శ్రీనివాస్ గౌడ్, బోనాల శ్రీనివాస్, ఖాజా, రుద్ర రాము, మీసాల శంకర్, తపట్ల రాజు, జగ్గని కనకయ్య, రావణవేణి సంపత్, కసవేని భూమయ్య, మాలోతు మాలతి, శివనాధుని వెంకటేశ్వర్లు, పల్లా శివకుమార్‌ను నియమించారు. అదేవిధంగా కరీంనగర్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కూడా కమిటీలో సభ్యులుగా ఉంటారు. సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు శ్రీధర్ బాబు లక్ష్మణ్ కుమార్ పొన్నం ప్రభాకర్ తో పాటు పెద్దలందరికీ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలకవర్గం పనిచేయాలని రాష్ట్రంలోనే అత్యుత్తమ మార్కెట్ కమిటీ కమిటీగా తీర్చిదిద్దాలని రాజేందర్ రావ్ సూచించారు.

**రాష్ట్రంలోనే మోడల్ గా తీర్చిదిద్దుతా..**

**మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య..**

రైతుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని కరీంనగర్ మార్కెట్ కమిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య పేర్కొన్నారు. ఆదర్శవంతమైన మార్కెట్ కమిటీగా తీర్చిదిద్దుతానని రైతుల సేవలో తరిస్తానని పేర్కొన్నారు. తన జీవితం రైతులకు అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వము ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ పెద్దలు నాకు గొప్ప అవకాశం ఇచ్చారు. రైతులకు సేవ చేసే భాగ్యం కల్పించారు. 24 గంటల పాటు రైతుల సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తాను. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి విప్ లు చింతకుంట విజయ రమణారావు ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నిత్యం రైతుల సంక్షేమానికి పాటుపడతానని రైతుల సేవలో తరిస్తానని స్పష్టం చేశారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని ఆకుల నరసయ్య పేర్కొన్నారు. పంటల సాగు నుంచి దిగుబడి ఇంటికి చేరి మద్దతు ధర వచ్చేవరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారి



**మంచిర్యాల, మహా :** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మకరందు మంచిర్యాల జిల్లా కలెక్టర్, కుమార్ దీపక్ ను, డిసిపి ఏ భాస్కర్ లను తమ అధికారిక కార్యాలయంలో ఆయన కలిసి పూల మొక్కను అందజేశారు. తాను నిర్వహిస్తున్న బాధ్యతలలో అవసరం మేరకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

## సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కురుమ సంఘం



**ఆలేరు, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కురుమ కార్పోరేషన్ ఏర్పాటు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ లతో పాటు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యల చిత్రపటాలకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు రైల్వే గేటు వద్ద గురువారం కురుమ సంఘం నాయకులు పాలాభిషేకం చేశారుఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు చిన్నం యాదగిరి,నాయకులు బీజన భాస్కర్, ఎగ్గిడి శ్రీ శైలం,ఎగ్గిడి శ్రీనుకౌన్సిల్ జూకంటి సంపత్, నాయకులు మల్లెల శ్రీకాంత్,జెట్ట సిద్దులు,పేరపు సిద్దులు,పేరపు రాములు,పిక్క శ్రీనివాస్, కూళ్ల సిద్దులు,కూళ్ల నర్సింహులు, బండ శ్రీను,బి.సిద్దులు తదితరులు పాల్గొన్నారు...రాష్ట్ర ప్రభుత్వం కురుమ కార్పొరేషన్ ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన ఏకైక కురుమ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సంఘం నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రైతుల గోస పట్టదా ..

**రోడ్డుపై బైఠాయించిన రైతులు**



**భువనగిరి, మహా:** మార్కెట్లో పోసిన ధాన్యాన్ని నేటి వరకు వేగవంతం చేయకపోవడాని నిరసిస్తూ భువనగిరి వలిగొండ రహదారిని గురువారం రైతులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి రైతులను పట్టించుకోకపోవడం వడ్లు కొనుగోలు వేగవంతం చేయకపోవడం దుర్మార్గమని వెంటనే ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బిజెపిపార్టీ నాయకులు జనగాం పాండు నోముల మహేందర్ రెడ్డి పుట్ట వీరేష్ యాదవ్ రాసాల మల్లేష్ నల్ల మాస సత్యనారాయణ రాసాల లింగస్వామి రాజశేఖర్ రెడ్డి దయాకర్ శ్రీకాంత్ వసంత కృష్ణవేణి దేవేందర్ సుదర్శన్ రెడ్డి శేఖర్ రాజమోహన్ జయపాల్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఆరూరు పిఏసిఎస్ చైర్మన్‌గా చిట్టెడ్డి



**వలిగొండ, మహా:** వలిగొండ మండల పరిధిలో అరురు పి ఏ సి ఎస్, చైర్మన్ గా చిట్టె డ్డి వెంకట్రామిరెడ్డి హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి నియమతులయ్యారు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి పి ఏ సి ఎస్ డైరెక్టర్లు మరియు వలిగొండ మాజీ ఎంపీపీ చిట్టె డ్డి జనార్ధన్ రెడ్డి, మాజీ సర్పంచి జినుకల దానయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులుబండారు నరసింహారెడ్డి, ఆవుల సత్యనారాయణ, వలిగొండ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిలకమర్రి కనకాచారి, మాజీ మత్స్యగిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్ , ఆరూరు రజక సంఘం అధ్యక్షులు వెలిమినేటి సంతోష్ కుమార్ , కొత్త కాపు నర్సిరెడ్డి, ముప్పిడి జలంధర్, సి ఓ కృష్ణ , సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లూరి వర్ధంతి కార్యక్రమంలో ఘన నివాళులు..



**మణుగూరు, మహా :** మన్యం వీరుడు, భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల హక్కుల కోసం పోరాడిన విప్లవ నాయకుడు శ్రీ అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా మణుగూరు క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ పాల్గొని అల్లూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేష్, క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు వరాహ నరసింహారాజు, బి నరసింహారాజు, బి రామరాజు, బీవీఆర్ రాజు, కాకర్లపూడి సుబ్బరాజు, చిరంజీవి రాజు, కొండాయిగూడెం నాని తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## గోపాలకుంట చెరువు విస్తీర్ణం సర్వే

**తహశీల్దార్ కి నివేదిక సమర్పిస్తాం సర్వేయర్ ప్రవీణ్**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి నర్సాపురం గోపాలకుంట చెరువు విస్తీర్ణం సర్వే నిర్వహించాలని గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశానుసారం గురువారం ఇరిగేషన్ ఏఈ మీనా, ఆధ్వర్యంలో మండల సర్వేయర్ ప్రవీణ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేర్ ప్రవీణ్ మాట్లాడుతూ గోపాలకుంట చెరువు హద్దుల ప్రకారం సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వే నివేదికను మండల తహశీల్దార్ కు సమర్పిస్తామని తెలిపారు. సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోదలసిన స్థానికులు మండల తహశీల్దార్ టి శ్రీనివాస్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిపిఓ పూర్ణచంద్రరావు, వీఆర్ఏ బహరాలి, గ్రామస్తులు లేళ్ళ అప్పిరెడ్డి, సంఘం చిన్నరాజు, అద్దానపు మల్లికార్జునరావు, బాదావత్ కృష్ణ, గోసు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

**మందమర్రి మండలం చిర్రకుంటలో ఘటన**



**మందమర్రి, మహా :** మందమర్రి మండలం చిర్రకుంట గ్రామంలో సంద్ర రాజలింగు నివాసంలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం ఉదయం వంట సంద్ర రాజలింగు, భూమయ్య కుటుంబీకులు వంట పనులు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలి పోయిందని అన్నారు. దానితో వారి నివాస గృహాలు పూర్తిగా కాలి బూడిద అయినట్లు వివరించారు. ఈ సంఘటనలు లక్ష రూపాయల నగదు, బంగారం, వెండి, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాస్ బుక్, ఇంట్లో విలువైన సామాగ్రి కాలిపోయినట్లు చెప్పారు. ఇంతకుముందు ఇంట్లో నుండి మంటలు భారీగా ఎగసిపడుతుండడంతో గ్రామస్తులు బెల్లంపల్లి ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను చల్లార్చారు. బాధిత రెండు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## "నాయి బ్రాహ్మణుల పట్ల వివక్ష సరికాదు"



**ఆత్మకూరు(ఎం) మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ కార్పొరేషన్లకు చైర్మన్ లను నియమించి ,నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని యాదాద్రి భువనగిరి జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బిక్షం ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో అనేకసార్లు వినతిపత్రాల ద్వారా ప్రభుత్వం దృష్టికి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో సభల్లో నాయి బ్రాహ్మణ వృత్తిని ముఖ్యమంత్రి గొప్పగా కొనియాడినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు.నిజానికి నాయి బ్రాహ్మణుల పట్ల ప్రేమ శ్రద్ధ ఉంటే వెంటనే ప్రత్యేక నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నాయి బ్రాహ్మణ వర్గానికే చెందిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆ నిధులు నేరుగా నాయి బ్రాహ్మణ కుటుంబాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కార్పొరేషన్ ద్వారా పేద నాయి బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలని వృత్తి పరంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏం మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు బండి నరేష్ టౌన్ అధ్యక్షులు రాచమల్ల బలరామ్ రాచమల్ల దుర్గయ్య రాచమల్ల నరసింహ జంపాల చందు అశోక్ యాదయ్య బుగ్గ రాములు తదితరు పాల్గొన్నారు

## 20 వేల ఇండ్లను 22A నిషేధిత జాబిత నుండి తొలగించాలి

**ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదాద్రి భువనగిరి, మహా:** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన రెవెన్యూ మరియు గృహనిర్మాణ అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించిన యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట, ఆలేరు ప్రాంతాల్లో 22A కింద నిషేధిత జాబితాలో నమోదైన పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన సుమారు 20 వేల ఇళ్లు, ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుండి తొలగించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని CCLA అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారుఅలాగే యాదగిరిగుట్ట రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని కోరగా, దీనిపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అదేవిధంగా తుర్కపల్లి మండలానికి అదనంగా మరో 50 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరగా, వాటి మంజూరుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇంకా తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో గతంలో నిర్మించిన ఇళ్లను ఫారెస్ట్ భూములుగా గుర్తించడం వల్ల కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సంబంధిత భూములను ఫారెస్ట్ జాబితా నుండి తొలగించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.అదేవిధంగా పెరిగిన రేషన్ కార్డుల సంఖ్యకు అనుగుణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరగా, దీనిపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి జాప్యం జరగకుండా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో కూడా ఆలస్యం లేకుండా అందుబాటులో ఉన్న వాహనాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాకు సంబంధించిన అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

## సౌర విద్యుత్ పై రైతులు అవగాహన పెంచుకోవాలి

**ఏడిఈ రవికుమార్**



**జూలూరుపాడు, మహా:** సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై రైతులు, గృహ వినియోగదారులు అవగాహన పెంచుకోవాలని జూలూరుపాడు ఏడిఈ రవికుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, రైతు వారోత్సవాల లో భాగంగా జూలూరుపాడు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నర్సాపురం రైతు వేదికలో రైతు వారము కార్యక్రమంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సౌర విద్యుత్ ను ప్రోత్సహించేందుకు అందరికీ సబ్సిడీతోపాటు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం అందిస్తోందని తెలిపారు. తద్వారా అవసరాలకు వాడుకోవడం తో పాటు ఇతరులకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖ ప్రభుత్వం ద్వారా రైతులకు గృహ వినియోగదారులకు అందిస్తున్న రాయితీలు ఇతర లాభాల గురించి తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత కరెంటు పొందని వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ నూతన నిబంధనల ప్రకారం డీడీ కట్టిన ప్రతి రైతుకు కరెంటు లైన్ ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా గ్రామాలలో, పంట పొలాలలో లూజ్ పానెల్స్, మిడిల్ పోల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, ఏఈ ప్రవీణ్, ఏఓ దీపక్ ఆనంద్, డిసీసీ సెక్రెటరీ ఆర్కే నాయుడు, లైన్ ఇన్స్పెక్టర్ లు సత్యనారాయణ, భాస్కరరావు, పాపకొల్లు, గుండ్లరేవు, కరివారి గూడెం, కొమ్ముగూడెం, సాయిరాం తండా సర్పంచ్ లు, రైతులు రామిశెట్టి రాంబాబు, మూ దు చిట్టిబాబు, లాకావత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైనిక్ సీటు సాధించిన ఆదివాసి ముద్దుబిడ్డ

**సోడే నరేంద్రనాథ్ భగవత్ ను అభినందించిన పాఠశాల డైరెక్టర్**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధి అనంతారం గ్రామానికి చెందిన ఆదివాసి ముద్దుబిడ్డ సోడే నరేంద్రనాథ్ భగవత్ రాష్ట్రస్థాయి సైనిక్ స్కూల్ సీట్ సాధించి తన సత్తా చాటాడు. సైనిక్ స్కూల్ సీటు సాధించిన నరేంద్రనాథ్ భగవత్ ను మండల కేంద్రంలోని సాయి ఎక్సలెంట్ స్కూల్ డైరెక్టర్ జక్కుల శివకుమారి స్వీట్ తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైనిక్ సీటు సాధన కోసం విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పోటీ పరీక్షల్లో సాయి ఎక్సలెంట్ స్కూలు విద్యార్థులు మరిన్ని అవకాశాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధిస్తూ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు పెంపొందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆరెబోయిన హుస్సేన్, ఉపాధ్యాయులు రమేష్, నవీన, ప్రశాంతి, విద్యార్థిని తండ్రి సోడే శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యం వాళ్లనే రైతుల ప్రాణాలు పోయాయి

- చనిపోయిన రైతు కుటుంబాలకు కోటి రూపాయలు చెల్లించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్



**మంచిర్యాల, మహా :** వారి ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యం వాళ్లనే రైతుల ప్రాణాలు పోయాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య లు ఆరోపించారు.మంచిర్యాల జిల్లా లక్షట్టిపేట మండలం గంపలపల్లి గ్రామంలో మృత్యువాత పడ్డ తనుగుల నాగరాజు, అభిలాష్ (తండ్రి కొడుకులు ), కొత్తూరు గ్రామంలో గుండారపు వెంకటేష్, రైతు కుటుంబాలను సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నాలుగురు ప్రాణాలు కోల్పోవడం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. వరి ధాన్యం కోసి 25 రోజులు గడిచిన ఇంకా కల్లాలకే పరిమితమైన వరి ధాన్యం. అకాల వర్షం, గాలి దుమారాం నుంచి కాపాడుకునే క్రమంలో అక్కడ గోడ ప్రక్కన నిలవడం వల్ల గాలి దుమారానికి ఆ గోడ కూలి ముగ్గురు రైతులు, ఒక కౌలు రైతు చనిపోయారని వారు వెల్లడించారు. చనిపోయిన రైతు కుటుంబాల బాధ వర్ణనాతీతంగా ఉందని అన్నారు. ప్రభుత్వం సరైన సమయంలో వరి కొనుగోలు చేస్తే ఇలా జరిగి ఉండేది కాదన్నారు.చనిపోయిన రైతు కుటుంబాలను ఇప్పటివరకు సంబంధిత అధికారులు కానీ, నాయకులు పరామర్శించిన దాఖలాలు లేవని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా వరి కొనుగోళ్లు వేగవంతం చేసి కోతలు లేకుండా గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరారు. చనిపోయిన రైతు కుటుంబాలకు ఒక కోటి రూపాయల పరిహారం చెల్లించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, కనికరపు అశోక్, గోమాస ప్రకాష్, బోడెంకి చందు సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు, ఉమారాణి, దూలం శ్రీనివాస్,దాగం రాజారామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**రాష్ట్ర కార్మిక, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**మంచిర్యాల, మహా :** రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం చెన్నూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ వినయ్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు, రవాణా అంశాలలో వేసవి ఉష్ణోగ్రతతో పాటు ఇతర రాష్ట్రాలలో కొనసాగుతున్న ఎన్నికల సందర్భంగా హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితులలో సైతం జిల్లాలో రోజుకు 150 లారీల ధాన్యం కొనుగోలు చేసి తరలిస్తున్నామని వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న ధాన్యం త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆలోచన మేరకు జిల్లాలో గోదాములను అద్దెకు తీసుకుని కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీల ద్వారా అనేక చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో సంబంధిత నగదు జమ చేసే విధంగా ప్రభుత్వ అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలో 1 లక్ష 83 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సోలార్ విద్యుత్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న



**కారేపల్లి, మహా:** రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అని ఆ దిశగా విద్యుత్ శాఖ పనిచేస్తుందని విద్యుత్ శాఖ కారేపల్లి మండల ఏఈ వెంకన్న అన్నారు. కారేపల్లి మండలంలోని రొట్టమాకురేవు రైతు వేదికలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సభలో ఏఈ వెంకన్న మాట్లాడుతూ... సోలార్ విద్యుత్ పథకాలపై రైతులు అవగాహన పెంచుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. గృహజ్యోతి పథకం తో పాటు ప్రభుత్వ విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా కోసం ఇంటర్ లింకింగ్ లైన్లతో విద్యుత్ శాఖ పనిచేస్తుందని చెప్పారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు నేరుగా రైతుల పొలాలకు వెళ్లి వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వినియోగ దారులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించడం కోసం విద్యుత్ ప్రజాపాలన కార్యక్రమం అందుబాటులో ఉందని వివరించారు. వ్యవసాయ సర్వీసుల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు ఉచిత ట్రాన్స్‌ఫార్మర్ రవాణా కూడా విద్యుత్ శాఖ చేస్తుందని అన్నారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను నివారించడానికి డిపార్ట్మెంట్ కండక్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ సేవలను రైతులు, విద్యుత్ వినియోగ దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మోతి ఠాకూర్ స్వామి, మత్యనాయక్, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, మండల వ్యవసాయాధికారి భట్టు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## లింగం బంజరలో ఆంజనేయస్వామి ధ్వజ ప్రతిష్ట మహోత్సవం



**కారేపల్లి, మహా:** మండల పరిధిలోని లింగం బంజర గ్రామంలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం నూతన జీవద్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో జీవద్వజ స్తంభం, నూతనంగా నిర్మాణం చేసిన గంగమ్మ తల్లి ఆలయంలో ప్రతిష్టించనున్న గంగమ్మ తల్లి విగ్రహాలను లింగం బంజర, రామలింగాలపల్లి గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ముందుకొచ్చిన ధ్వజస్తంభం, గంగమ్మ తల్లి విగ్రహాలకు వాహనాల ముందు బిందెలతో నీళ్లు పోసి పసుపు కుంకుమలు చల్లి కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ప్రతిష్ట కార్యక్రమం రోజు ఉదయం ఏడు గంటలకు గణపతి పూజ కర్మణా పుణ్య వాచనములు, 8 గంటల 40 నిమిషాలకు యంత్ర, విగ్రహం ప్రతిష్ట 11 గంటలకు పూర్ణాహుతి మండవ ఉద్వాసనలు, ఆశీర్వచనములతో కార్యక్రమాలు ముగుస్తాయని అనంతరం ఆదరణ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారని తెలిపారు. విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలకు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించి అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు . ఈ కార్యక్రమాల న్నీ అర్చకులు అచ్యుత రామారావు శర్మ నేతృత్వంలో జరుగుతున్నాయని తెలిపారు.

## ఉపాధి కూలీలకు పనిముట్ల పంపిణీ..



**మణుగూరు, మహా :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద పనిచేసే రోజువారి కూలీలకు పనిముట్లు పంపిణీ కార్యక్రమం మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించారు. పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ కూలీలకు గడ్డపారలు, ప్లాస్టిక్ బేసిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, పనికి అవసరమైన పనిముట్లు అందజేస్తోందని తెలిపారు. పని ప్రదేశాల్లో రక్షణ ప్రమాణాలు కూడా పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉపాధి కూలీలను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి శ్రీకాంత్, గ్రామీణ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రావణి సాయి, వినీత, సుస్మిత, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో తీవ్ర ఇబ్బందులు

**మే 13న బూర్గంపాడులో భారీ ధర్నాకు పిలుపు**

**పాత పద్ధతిలోనే ఉపాధి పనులు కొనసాగించాలని డిమాండ్**



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం శ్రీరాంపురం ఎస్సీ కాలనీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కార్మికులతో మాట్లాడిన ఆయన, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానాల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి పనులను "వీబీజీ - రామ్‌జీ" పేరుతో అమలు చేస్తూ కార్మికులకు పని చేయలేని పరిస్థితి తీసుకొస్తున్నారని విమర్శించారు. పనికి వెళ్లిన కార్మికులు కళ్ల ముందే కెమెరాలో కనిపించకపోతే పని లేనట్లుగా చూపించి ఇంటికి పంపిస్తున్నారని, మండుటెండల్లో మంచి నీళ్లు తాగుతూ కష్టపడి పని చేసినా సరైన వేతనాలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఏప్రిల్ నెలలో చేసిన పనులకు ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదని, ప్రభుత్వం 125 రోజుల పని హామీ ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ వాస్తవానికి 35 నుండి 50 రోజుల పనికే పరిమితం అవుతోందని అన్నారు. అదే సమయంలో సంక్షేమ పథకాల అర్హత కోసం కనీస పని రోజుల నిబంధనలు విధించడం కార్మికులకు మరింత ఇబ్బందిగా మారిందన్నారు.పనులు ఎక్కువున్నాయో చూపించకుండా టార్గెట్లు మాత్రం విధిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కార్మికులు ఎలా పని చేయాలంటూ ప్రశ్నించారు. అందువల్ల పాత పద్ధతిలోనే ఉపాధి పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. భూమిలేని ఉపాధి కార్మికులకు జాబ్ కార్డు ఆధారంగా ₹12,000 ఆర్థిక సాయం అందించాలని, మహిళలకు ₹2,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామసభ ద్వారా ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేయాలని, స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలని కోరారు.అదేవిధంగా వృద్ధాప్య పింఛన్లు ₹4,000, వికలాంగుల పింఛన్లు ₹6,000 వెంటనే అమలు చేయాలని, కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యల పరిష్కారం కోసం మే 13న బూర్గంపాడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మండల వ్యాప్తంగా ప్రజలు, ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఉపాధి హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బానోత్ తార, లక్ష్మి, స్వర్ణ, సత్యవతి, బోడ లక్ష్మణ్, వెంకట్, అంకిరెడ్డి, మహేశ్వర్, త్రివేణి, ఉపారాణి, రంజాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అటవీ శాఖ 'పెద్ద'లు

**రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎఫ్డీఓ, డీఆర్ఓ**



**చర్ల మహా :**అటవీ శాఖలో అవినీతి తిమింగలాలు మరోసారి ఏసీబీకి చిక్కాయి. రోడ్డు పనుల వ్యవహారంలో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భారీగా లంచం డిమాండ్ చేసిన భద్రాచలం డివిజనల్ అటవీ అధికారి (FDO), సెక్షన్ ఆఫీసర్ గురువారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.

**అసలేం జరిగిందంటే?**

చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో కొత్తగా రోడ్డు వేస్తుండగా, పనుల క్రమంలో కొన్ని అటవీ శాఖ చెట్లు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని సాకుగా చూపి, సదరు కాంట్రాక్టర్ లేదా బాధ్యులపై కేసు నమోదు చేయకుండా ఉండాలంటే *రూ. 10 లక్షలు సమర్పించుకోవాలని భద్రాచలం ఎఫ్డీఓ సుజాత డిమాండ్ చేశారు.

**ఏసీబీ వ్యూహం - రెడ్ హ్యాండెడ్ గా అరెస్ట్**

బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో, డిఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు వ్యూహం రచించారు. గురువారం భద్రాచలం కార్యాలయంలో తొలి విడతగా రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎఫ్డీఓ సుజాతతో పాటు, చర్ల ఇన్చార్జ్ డీఆర్ఓ (DRO) కృష్ణయ్యను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. "అవినీతికి పాల్పడే ఏ అధికారిని వదిలే ప్రసక్తే లేదు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి."— వై. రమేష్, ఏసీబీ డిఎస్పీ

**అటవీ శాఖలో ఆగని అవినీతి**

గతంలో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన జిల్లా అధికారి మూడున్నర లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడటం గమనార్హం. వరుస ఘటనలతో అటవీ శాఖలో అవినీతి ఏ స్థాయిలో పేరుకుపోయిందో అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తూ, రికార్డులను పరిశీలిస్తున్నారు.

## నాయి బ్రాహ్మణుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోంది

**నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ**

**జూలూరుపాడు, మహా:** అన్ని విధాలుగా వెనుకబాటుకు గురవుతున్న నాయి బ్రాహ్మణుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత చెబుతుందని నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కడియాల సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన వివిధ కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు చోటు కల్పించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని అన్నారు. గతంలో అనేకసార్లు వినతి పత్రాల ద్వారా ప్రభుత్వం దృష్టికి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో నాయి బ్రాహ్మణ వృత్తిని ముఖ్యమంత్రి గొప్పగా కొనియాడారని, అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయి బ్రాహ్మణుల పట్ల ప్రేమ, శ్రద్ధ ఉంటే వెంటనే ప్రత్యేక నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ను ఏర్పాటు చేసి, కార్పొరేషన్‌కు నాయి బ్రాహ్మణ వర్గానికే చెందిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ఆ నిధులు నేరుగా నాయి బ్రాహ్మణ కుటుంబాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ ప్రమేయం లేకుండా కార్పొరేషన్ ద్వారా పేద నాయి బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలని, వృత్తి ఆధారిత సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నాయి బ్రాహ్మణులకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కడియాల సత్యనారాయణ హెచ్చరించారు.

## వరి, పత్తి రైతులకు క్రాప్ బుకింగ్ తప్పనిసరి..

**వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి..**



**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలోని వరి, పత్తి రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే ముందస్తుగా క్రాప్ బుకింగ్ చేయించుకోవడం తప్పనిసరిగా చేయాలని మణుగూరు వ్యవసాయ శాఖ అధికారి రాహుల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో పాటు బోనస్ వర్తిస్తుందని తెలిపారు. మండలంలోని అన్ని వరి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, సహకార సంఘాల ప్రధాన కార్యనిర్వాహకులు, సంబంధిత కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయని పేర్కొన్నారు. రైతులు తమ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఆధార్ కార్డు, భూ స్లిప్పులు లేదా భూమి పత్రాలతో వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుత సీజన్ వరకు మాత్రమే పాత విధానంలో నమోదు సౌకర్యం ఉంటుందని, తదుపరి సీజన్ నుంచి ఆన్‌లైన్ విధానంలో మాత్రమే నమోదు చేపడతామని అధికారులు తెలిపారు. అందువల్ల రైతులు ఆలస్యం చేయకుండా తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. క్రాప్ బుకింగ్ చేయించుకోని రైతులు భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్, ధాన్యం కొనుగోలు సదుపాయాలకు అర్హులు కాబోరని హెచ్చరించారు. ఈ సమాచారాన్ని ప్రతి రైతుకు తప్పనిసరిగా చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు.

# మానవత్వం పరిమళించిన వేళ

**ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన యువకులు**



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలం సారపాకలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఇటీవల నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా జరిగిన అనుకోని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ కుటుంబానికి స్థానిక యువకులు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.సారపాక ఆర్చి సమీపంలో కిరాయి ఇంట్లో నివసిస్తున్న నర్మదా భర్త ప్రభాకర్ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ప్రమాదంలో నర్మదాకు రెండు కాళ్లు విరగడంతో పాటు ఛాతి పక్కటెముకలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఆమె చికిత్స కోసం కుటుంబం తీవ్ర కష్టాలు పడుతోంది.ప్రభాకర్ ఐటీసీ పీఎస్పీడీలో ఎన్ మాస్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే నర్మదా, ప్రభాకర్ ఇద్దరికీ తల్లిదండ్రుల సహాయం లేకపోవడం, కుటుంబంలో ఐదు సంవత్సరాల పాపతో పాటు 18 నెలల చిన్నారి ఉండటంతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి ఉదయ్ కుమార్ తన వంతు సహాయంగా 25 కేజీల బియ్యం బస్తాను అందించగా, బుక్య లాల్ రూ.500 విలువైన కూరగాయలను అందించి కుటుంబానికి అండగా నిలిచారు. వారి సహాయస్ఫూర్తిని స్థానికులు అభినందిస్తూ, మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.

## భారత ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయండి



- ప్రధాని బహిరంగ సభకు తరలిరావాలని బిజెపి నాయకుల పిలుపు
- సికింద్రాబాద్ సభా ప్రాంగణానికి ప్రత్యేక వాహనాల ఏర్పాట్లు

**సత్తుపల్లి, మహా:** దేశ ప్రజల ప్రయోజనార్థం అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, పూర్తయిన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 10వ తారీఖు సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో భారీ బహిరంగ సభకు హాజరుకానున్నట్లు సత్తుపల్లి నియోజకవర్గ బిజెపి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర ప్రజలు భారీగా కదలి రావాలని పిలుపునిచ్చారు. సభా ప్రాంగణానికి చేరుకోవడానికి సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక వాహన సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి మంద శివ యాదవ్, నాగ మౌనిక, సాయి యాదవ్, సుబ్రహ్మణ్యం, అశోక్, పెద్దిరాజు, ఎస్.కె రహమతుల్లా, మన్నేని నరసింహారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సౌర విద్యుత్ పథకాలపై రైతులకు అవగాహన..



**మణుగూరు, మహా :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన రైతు వారోత్సవ కార్యక్రమాల సందర్భంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రాలు-విద్యుత్ కేంద్రాలు, మోడల్ సోలార్ విలేజ్, ప్రధానమంత్రి కుసుమ్ పథకాలపై అవగాహన సదస్సును గురువారం విద్యుత్ అధికారులు నిర్వహించారు. విద్యుత్ శాఖ మణుగూరు సహాయ విభాగ ఇంజనీర్ ఉమామహేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని పథకాల వివరాలను రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగం ద్వారా రైతులకు ఖర్చులు తగ్గడంతో పాటు ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు ఇంటి పైకప్పులపై సౌర విద్యుత్ ఏర్పాట్లు చేసుకోవచ్చని, ఇందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, స్థానిక రైతులు పాల్గొని విద్యుత్తుకు సంబంధించి తమ అనుభవాలను ఈ వేదికలో చర్చించుకున్నారు. మండల వ్యవసాయ అధికారులు కూడా హాజరై రైతులకు పంటల అభివృద్ధి, సాగులో సాంకేతికత వినియోగంపై సందేశాలు ఇచ్చారు. అదేవిధంగా విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భద్రతా నిబంధనలు పాటించాలని ప్రజలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్ స్పెక్టర్ జి సర్వేశ్వరరావు, లైన్ ఇన్ స్పెక్టర్లు ఎం మధుసూదనరావు, బి శంకర్, ఎం అశోక్ కుమార్, లైన్మెన్, అసిస్టెంట్ లైన్మెన్ లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదల క్రమశిక్షణతోనే ఎదుగుదల

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పట్టుదల క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చునని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. టెన్త్ ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది పిల్లలను ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మొత్తం 63 మంది పోలీస్ సిబ్బంది పిల్లలు వారి తల్లీదండ్రులు హాజరయ్యారు. ముందుగా మంచి మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులు కొంతమంది తమ తల్లీదండ్రుల కష్టాన్ని భవిష్యత్తులో తాము సాధించాలనుకుంటున్న లక్ష్యాలను వివరిస్తూ ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకుగాను ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో అహర్నిశలు కష్టపడుతూ ప్రజలకు సేవలు అందిస్తూ తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న తల్లిదండ్రులు కష్టాన్ని గుర్తించాలని పిల్లలకు సూచించారు. పట్టుదల క్రమశిక్షణ ఆత్మ స్థైర్యం ఉంటే ఎలాంటి కష్టమైన లక్ష్యాన్నైనా సులభంగా సాధించవచ్చని అన్నారు. జీవితంలో ఎల్లప్పుడూ పాఠాలను నేర్చుకుంటూనే ఉండాలని ప్రతి రోజు ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలని తెలిపారు. మంచి స్నేహితులను ఏర్పాటు చేసుకొని దురలవాట్లకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలకు చేరుకొని తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పోలీస్ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎస్పీ బాల్యం నుండి ఐపిఎస్ సాధించే వరకు తన గత స్మృతులను వారితో పంచుకున్నారు. అనంతరం మంచి మార్కులు సాధించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు కుటుంబంలోని విద్యార్థినీ విద్యార్థులకు ఎస్పీ ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, వన్టౌన్ సీఐ కరుణాకర్, త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎంటిఓ సుధాకర్, హోంగార్డ్స్ ఇంచార్జ్ ఆర్ఐ నరసింహారావు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# 14వ వేతన ఒప్పందంపై జేసీఎల్ వరంగల్‌కు ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల ఫిర్యాదు

**కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఒప్పందం చేశారని ఆరోపణలు**



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో ఇటీవల కుదిరిన 14వ వేతన ఒప్పందంపై ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (JCL) వరంగల్ కార్యాలయంలో కమిషనర్ కె. రాజేంద్రప్రసాద్ గారిని కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల అధ్యక్షుడు గోనే రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమలో కార్మికుల హక్కులను గుర్తింపు సంఘం మరియు యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు.గత ఆరు నెలలుగా 14వ వేతన ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయని, మంగళవారం ఒప్పందం పూర్తయిందని ప్రకటించినప్పటికీ, ఒప్పంద వివరాలు కార్మికులకు పూర్తిగా అన్యాయంగా ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలోని సుమారు 94.5 శాతం మంది కార్మికులు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.ఈ ఒప్పందం ద్వారా దాదాపు 100 మంది పర్మినెంట్ కార్మికులను తగ్గించే విధంగా నిబంధనలు పెట్టారని ఆరోపించారు. పరిశ్రమలో వార్షిక ఉత్పత్తి 70 వేల టన్నుల నుండి 8 లక్షల టన్నులకు పెరిగినా, కార్మికుల జీవన ప్రమాణాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు.గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఈ ఒప్పందం కుదిరిందని, కార్మికుల విశ్వాసాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని విమర్శించారు.అలాగే 18 నెలల క్రితం TNTUC సంఘాన్ని గెలిపించేందుకు దొంగ జాబ్ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇప్పటికీ ఆ నియామక ప్రక్రియ పూర్తి చేయకుండా బదిలీ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులను అనిశ్చితిలోకి నెట్టారని ఆరోపించారు.కాబట్టి ఈ సమస్యలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని తక్షణమే జోక్యం చేసుకోవాలని, పరిశ్రమలో పారిశ్రామిక శాంతి భద్రతలకు భంగం కలగకుండా వేతన ఒప్పందాన్ని సమగ్రంగా పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని JCL అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రంగబాబు, హరి తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఘనంగా నిర్వహణ

**అల్లూరి త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శమని కొనియాడిన నాయకులు**




**చర్ల మహా :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా చర్ల మండలంలో ధర్మజాగరణ పరిరక్షణ సమితి, విశ్వహిందూ పరిషత్, వనవాసి కళ్యాణ పరిషత్, సేవా భారతి మండల కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. భారతమాతను బ్రిటిష్ పాలకుల దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేయాలనే లక్ష్యంతో పోరాడిన మహా వీరుడిగా అల్లూరిని కొనియాడారు.బ్రిటిష్ ప్రభుత్వ దాష్టీకాన్ని ధైర్యంగా ఎదుర్కొని గిరిజనుల హక్కుల కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని నాయకులు పేర్కొన్నారు. చిన్న వయసులోనే దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుని త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మజాగరణ పరిరక్షణ సమితి తరుపున తాళ్లూరి వరలక్ష్మి,శేషెట్టి మంజుల,మీసాల సరస్వతి,కాసికంటి శ్రీదేవి, M.పద్మజ వనవాసి కళ్యాణ పరిషత్ నుండి పెద్దదా ఆశలత విశ్వహిందూ పరిషత్ నుండి E.రాము,వెంకట్రావు, కిశోర్, వినోద్, సేవా భారతి సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# పంచాయతీకి శవ పేటిక బహుకరణ

**నేలకొండపల్లి, మహా:** పంచాయతీ కి శవ పేటిక ను గ్రామానికి చెందిన విద్యుత్ సంస్థ డీఈఈ ధీరావత్ కోటేశ్వరరావు పంచాయతీ కి అందించారు. గురువారం కార్యాలయం లో సర్పంచ్ దీరావత్ ఆశోకరాణి ఆధ్వర్యంలో పంచాయతీకి అప్పగించారు. ఈ సందర్భంగా చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి మాట్లాడారు..చివర మజిలీ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కోటేశ్వరరావు శవ పేటిక ను ఉచితంగా అందించారని తెలిపారు. ఎవరి వద్ద చందాలు అడగకుండా... గ్రామస్తుల సౌకర్యార్థం పంచాయతీ కి కొనుగోలు చేసి అందించటం సంతోషంగా ఉందని అన్నారు. గ్రామాభివృద్ధి కి చందాలు లేకుండా ప్రభుత్వం నిధులతో అన్నిసౌకర్యాలు కల్పించే విధంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. "ఈ కార్యక్రమంలో రాజారాంపేట సొసైటీ అధ్యక్షుడు ధీరావత్ బాలాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ సీత్యా, గ్రామ పెద్దలు భూక్యా గోబ్రియా, రమణ, మోహన్రావు. కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సోము తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో రైతుల నెత్తిపై శఠగోపం!

**నల్గొండ, మహా :** జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్రమాలకు నిలయంగా మారాయని, రైతులను నిలువునా దోచుకుంటున్నారని నల్గొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం ఆయన నియోజకవర్గ పరిధిలోని ఆర్జాలబావి, దండంపల్లి, ఎస్ఎల్బీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును వెళ్లబోసుకుంటూ..ధాన్యం తెచ్చి నెల రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాలను సందర్శించిన అనంతరం కంచర్ల భూపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. నిబంధనల ప్రకారం కాకుండా బస్తాకు 42 కిలోల 700 గ్రాముల చొప్పున తూకం వేస్తూ రైతులను నష్టపరుస్తున్నారని మండిపడ్డారు. ప్రతి బస్తాకు మూడు రూపాయల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నారని ఇది అత్యంత దారుణమని పేర్కొన్నారు. తూకం వేసిన వెంటనే ట్రక్ షీట్లు ఇవ్వడం లేదని, మిల్లుల వద్దకు వెళ్లాక తూకం తక్కువ వచ్చిందనే సాకుతో మిల్లర్లు ట్రక్ షీట్లు మార్పించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.





# మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 08-05-2026




ANN తెలుగు




## బర్త్ డేకి గ్రాండ్‌గా...

అభిమాన హీరో పుట్టినరోజు దగ్గర పడుతోందంటే అభిమానులు ఆ హీరో తాజా చిత్రాల అప్‌డేట్స్‌ని ఆశిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులు అలానే అప్‌డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 20న ఈ హీరో పుట్టినరోజు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ ఆశించేవాటిలో ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఒకటి. బర్త్ డేకి గ్రాండ్‌గా ఒక వీడియోను విడుదల చేయడానికి ఈ టీమ్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ వీడియోలో విజుల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని టాక్. కుమార స్వామి నేపథ్యంలో త్రివిక్రమ్ తెరకెక్కించనున్న ఈ మైథలాజికల్ మూవీకి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఓ వార్త ప్రచారంలో ఉంది. మరి... ప్రచారంలో ఉన్నట్లు వీడియోను విడుదల చేస్తారా? ఆ రోజు టైటిల్‌ని కూడా ప్రకటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమా అంగీకరించాక కుమార స్వామి గురించి తెలుసుకోవడానికి ఎన్టీఆర్ పుస్తకాలు చదువుతున్నారట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు ఎన్టీఆర్. అలాగే 'దేవర' రెండో భాగం కూడా ఉంది.



## రామ్ చరణ్ 'పెద్ది' గాయాల కథ

పెద్ది సినిమా షూటింగ్ సమయంలో రామ్ చరణ్ ఊహించని విధంగా గాయపడిన విషయం అప్పట్లో పెద్ద చర్చగా మారింది. కంటికి దెబ్బ తగిలిన వెంటనే అతడ్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చిన్నపాటి సర్జరీ చేసి ఇంటికి పంపించారు. ఒక్క రోజు విశ్రాంతి తీసుకుని చరణ్ మళ్లీ వెంటనే సెట్స్‌లో జాయిన్ కావడం అతడి ప్రొఫెషనలిజాన్ని చూపించింది. కంటిపైన ప్లాస్టర్‌తో చరణ్ కనిపించిన ఫొటోలు అప్పట్లో వైరల్ అయ్యాయి. అభిమానులు ఎంతో బాధపడ్డారు. అయితే తాజాగా ఆ గాయానికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకొచ్చాయి. చాలామంది అది క్రికెట్ సన్నివేశం చిత్రీకరణ సమయంలో చరణ్‌కి బాల్ తగిలి గాయమైందని అనుకున్నారు. కానీ నిజానికి పహిల్వాన్ గెటప్‌లో కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు ఏదో బరువైన వస్తువు కంటికి తగిలి గాయం జరిగింది. ఆ గాయం ఇప్పటికీ చరణ్ కంటి పైభాగంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల ఓ సినిమా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు అది బయటపడింది. చరణ్‌కి ఇది మాత్రమే కాదు, జిమ్‌లో వర్కవుట్ చేస్తున్నప్పుడు, 'చికిరి చికిరి' పాట షూటింగ్ సమయంలో కూడా గాయాల పాలయ్యాడని సమాచారం. ఇక పెద్ది విషయానికి వస్తే.. రామ్ చరణ్ గత చిత్రం 'గేమ్ ఛేంజర్' ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, 'పెద్ది'పై అంచనాలు మాత్రం తగ్గలేదు. ఇప్పటికే విడుదలైన పాటలు, గ్లింప్స్ మంచి స్పందన తెచ్చుకోవడంతో సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ చిత్రాన్ని వచ్చే నెల 4న విడుదల చేయబోతున్నారు. త్వరలోనే ట్రయిలర్ రిలీజ్‌కానుంది. దాంతో ఇప్పుడు అందరి దృష్టి ట్రయిలర్‌పైనే ఉంది. ముఖ్యంగా చరణ్ మూడో లుక్ ఉంటుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.



## ఆగస్టులో ఆట మొదలు

దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఐ యామ్ గేమ్'. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆంటోని వర్గీస్, మైస్కిన్, కయాదు లోహర్, కతిర్, పార్థ్ తివారి, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటించారు. వే ఫారర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. కాగా ఈ మూవీని ఆగస్టులో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, దుల్కర్ సల్మాన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ''నా కెరీర్‌లో చేసిన సినిమాల్లో 'ఐ యామ్ గేమ్' అత్యంత స్టైలిష్ ఫిల్మ్. నహాస్ హిదాయత్ ప్రత్యేకంగా నన్ను ఓ కొత్త స్టైలిష్ లుక్‌లో చూపించడం ఈ ప్రాజెక్ట్‌కు హైలెట్. 'లోకా' వంటి మెగా బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిలిమ్స్ నుంచి వస్తున్న చిత్రం 'ఐ యామ్ గేమ్'. మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది'' అని దుల్కర్ సల్మాన్ పేర్కొన్నారు.



## 'ఎల్లమ్మ' కోసం రంగంలోకి 'సీత'..

బలగం లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత వేణు యెల్దండి చాలా గ్యాప్ తీసుకొని ఇప్పుడు 'ఎల్లమ్మ'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. అయితే ఈ సినిమా ఎప్పుడో ప్రారంభం కావాల్సింది. ఇంకా చెప్పాలంటే..ఈ పాటికి షూటింగ్ కూడా పూర్తయి..రిలీజ్ కావాల్సిన సినిమా. కానీ పలు కారణాలతో షూటింగ్ వాయిదా పడింది. తొలుత ఈ కథను హీరో నానితో చేయాలనుకున్నాడు. కానీ ఆయన బిజీ కావడంతో నితిన్‌తో తెరకెక్కించాలనుకున్నారు. ఈ మేరకు నిర్మాత దిల్ రాజు అధికారికంగా నితిన్ పేరుని ప్రకటించాడు కూడా. కానీ తమ్ముడు సినిమా రిలీజ్ తర్వాత నితిన్ కూడా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నాడు. ఆ తర్వాత బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్నాడనే పుకార్లు వచ్చాయి. కానీ చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. విడుదల చేసిన గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇలా మొత్తానికి వేణు ఎల్లమ్మ కథకి హీరో అయితే ఫిక్స్ అయ్యాడు. కానీ,ఇంకా హీరోయిన్ ఫిక్స్ కాలేదు. టైటిల్ మాదిరే ఈ సినిమాలో హీరోయిన్ పాత్రే చాలా బలంగా ఉండబోతుందట. అందుకే ఓ స్టార్ హీరోయిన్‌ని పెట్టుకోవాలని వేణు, దిల్ రాజు భావిస్తున్నారట. గతంలో సాయి పల్లవి, కీర్తి సురేశ్ పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ వాళ్లిద్దరు నో చెప్పేశారట. ఇక ఇప్పుడు ఎల్లమ్మ పాత్ర కోసం మృణాల్ ఠాకూర్‌ని ఒప్పించినట్లు సమాచారం. 'సీతారామం'లో సీతగా తెలుగు ఆడియన్స్ మనసు దోచేసిన మృణాల్.. ఎల్లమ్మ కథ నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. అయితే పారితోషికం కాస్త పెంచమని చెప్పినట్లు సమాచారం. డెకాయిట్ కోసం ఆమె దాదాపు రూ.2.5 కోట్ల వరకు తీసుకుంది. ఇక ఎల్లమ్మ కోసం రూ. 3 కోట్లు డిమాండ్ చేసిందనే టాక్ టాలీవుడ్‌లో వినిపిస్తుంది. ప్రస్తుతం పారితోషికం విషయంలో చర్చలు జరుగుతున్నాయట. అన్నీ ఓకే అయిన తర్వాత అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



## చిన్న గ్యాప్ తరువాత మళ్లీ బిజీ అవుతున్న హీరోయిన్

ఒక్కసారి నటుడైనా, నటి అయినా సక్సెస్‌ను అందుకంటే సినిమా వారిని అంత సులభంగా వదులుకోదు. అలా ఏళ్ల తరబడి ఈ రంగంలో కొనసాగుతున్న వారు చాలా మంది ఉన్నారు. అలాంటి తారలలో నటి వేదిక ఒకరు. ఈ మహారాష్ట్ర భామ గత రెండు దశాబ్దాలుగా కథానాయకిగా రాణిస్తున్నారు. తమిళంలోకి 2005లో ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని చేరుకున్నారు. ముఖ్యంగా ఇంతకు ముందు తమిళంలో పరదేశీ, కావ్యతలైవన్, శివలింగ, బానం వంటి చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. ఈమె పలు చిత్రాల్లో ప్రత్యేక పాత్రల్లోనూ నటించి మెప్పించారు. పలు వాణిజ్య ప్రకటనల్లోనూ నటించిన వేధికకు తమిళంలో చిన్న గ్యాప్ వచ్చింది. అయితే దాన్ని పూర్తి చేసే విధంగా మళ్లీ బిజీ అవుతున్నారు. ప్రస్తుతం మహాల్ అనే తమిళ చిత్రంతో పాటు తమిళం,తెలుగు భాషల్లో రూపొందుతున్న మరో చిత్రంలోనూ నటిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు ఆమె స్థానాన్ని ఇక్కడ సుస్థిరం పరుస్తాయనే నమ్మకంతో ఉన్నారు. ఆకర్షణీయమైన అవయవ సంపద, అభినయం కలిగిన ఈ 38 ఏళ్ల భామ ఇటీవల వెబ్ ప్రపంచంలోకి ఎంట్రీ ఇచ్చారు. అర్కా మీడియా నిర్మించిన యక్షిణి అనే వెబ్ సిరీస్‌లో ప్రధాన పాత్రను పోషించారు. అందులో ఈమె బోల్డ్ నటనకు గానూ హిందూస్థాన్ టైమ్స్ ఓటీటీ ప్లే అవార్డును గెలుచుకున్నారు.. కాగా చిన్న గ్యాప్ తరువాత మళ్లీ తమిళంలో వరుసగా అవకాశాలను అందుకుంటూ బిజీ అవుతున్నట్లు సమాచారం.



## అలాంటి పరిస్థితి ఏ మహిళకీ రాకూడదు : లావణ్య త్రిపాఠి

''సతీ లీలావతి' పూర్తి వినోదాత్మక చిత్రం. ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమా విజయంపై ఎంతో నమ్మకం ఉంది'' అని చెప్పారు హీరోయిన్ లావణ్య త్రిపాఠి. దేవ్ మోహన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రధారులుగా, తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందిన సినిమా 'సతీ లీలావతి'. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో నాగమోహన్ నిర్మించిన ఈ సినిమా నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నేను డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఈ సినిమాలోని కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు. కొన్నిచోట్ల భావోద్వేగాల సన్నివేశాలు కూడా ఉన్నాయి. అలాగే మంచి సందేశం కూడా ఉంది. కానీ సందేశం ఏదో క్లాస్ చెబుతున్నట్లుగా ఉండదు. ఈ సినిమాలో చూపించినట్లుగా రిలేషన్స్ బయటి ప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకీ రాకూడదు. ఇక కమల్‌హాసన్‌గారి 'సతీ లీలావతి'తో మా చిత్రాన్ని పోల్చలేం. అదొక క్లాసిక్ చిత్రం. కానీ మా చిత్రంలో ఆడియన్స్ ఎంజాయ్ చేయగల కామెడీ ఉంది'' అని అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com